

వైజాగ్ - చెన్నై కారిడార్‌కు ప్రాధాన్యం

పారిశ్రామికరంగానికి భారీ కేటాయింపులతో ప్రయోజనం

వెనుకబడిన జిల్లా కింద కొనసాగనున్న ఆర్థిక సాయం



తిరుపతి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌కు సంబంధించి కేటాయింపులు వెల్లడైంది స్థూలంగా మాత్రమే. జిల్లాలోని ఐఐటీ, ఐజర్, కలినరీ ఇన్‌స్టిట్యూట్, జాతీయ సంస్కృత వర్సిటీ, విమానాశ్రయం, రైల్వే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుల వివరాలు తెలియడానికి కొంత సమయం పట్టనుంది.ఇతర కేటాయింపుల విషయానికి వస్తే జిల్లా మీదుగా వెళుతున్న వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇస్తున్నట్టు ప్రకటించింది. జిల్లాకు సంబంధించి ఈ కారిడార్ పరిధిలోకి వెంకటగిరి, గూడూరు, సూళ్ళూరుపేట, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలు వస్తుండగా వీటి పరిధిలో కారిడార్‌కు సంబంధించిన పలు నోడ్‌లున్నాయి. ఇప్పటికే ఆయా చోట్ల పారిశ్రామిక వాడలు ఏర్పాటు కాగా మిగిలిన చోట్ల పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు భూసేకరణ జరుగుతోంది. తాజా బడ్జెట్‌లో ఈ కారిడార్‌కు ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో పారిశ్రామిక వాడల ఏర్పాటు వేగవంతం కానుంది. అలాగే ఇప్పటికే ఏర్పాటైన వాడల్లో పరిశ్రమలు వచ్చే అవకాశం మరింత మెరుగుపడనుంది. వెనుకబడిన జిల్లాలకు ఆర్థిక సాయం అందించే పథకాన్ని ఈ ఏడాది కూడా కొనసాగించనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ఈ పథకం కింద ఉమ్మడి చిత్తూరు జిల్లాకు రూ. 50 కోట్లు విడుదల కానున్నాయి. ఈ నిధులను ప్రధానంగా జిల్లాలోని వెనుకబడిన మారుమూల ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు వినియోగించనున్నారు.తాజా బడ్జెట్‌లో పారిశ్రామిక రంగానికి కేటాయింపులు భారీగా పెరిగినందున పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం వున్న జిల్లాలోని తూర్పు ప్రాంతాలకు మేలు జరగనుంది.ఇప్పటికే సూళ్ళూరుపేట, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో పారిశ్రామిక రంగం వృద్ధి చెందింది. శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు, రేణిగుంట, నాయుడుపేట, తడ, వరదయ్యపాలెం, సత్యవేడు మండలాల పరిధిలో జాతీయ, బహుళ జాతి కంపెనీలు, పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. శ్రీసిటీ సెజ్ ప్రైవేటు రంగంలో వుండగా నాయుడుపేట మండలం మేనకూరు సెజ్ పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో నడుస్తోంది. అయితే శ్రీసిటీతో పోలిస్తే మేనకూరు సెజ్ పరిశ్రమల ఏర్పాటు, నిర్వహణ విషయాల్లో బాగా వెనుకబడి వుంది.తాజా బడ్జెట్ కేటాయింపులతో ఇక్కడ కూడా మరిన్ని పరిశ్రమల ఏర్పాటు వేగవంతం కానుంది.ముద్ర రుణాల పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచడం ద్వారా మరింతమంది యువకులు వ్యాపారాలు, సూక్ష్మ తరహా పరిశ్రమలు స్థాపించి అభివృద్ధి చెందే అవకాశం ఏర్పడింది.

అమరావతి ఇక పరుగులే

అమరావతికి రూ.15వేల కోట్ల కేటాయింపుతో పనులు వేగవంతం కానున్నాయి.అదేవిధంగా కేంద్ర సహకారంతో పోలవరం ప్రాజెక్టు కూడా పూర్తికానుంది.

- ఆరణి శ్రీనివాసులు, తిరుపతి ఎమ్మెల్యే

రాష్ట్రానికి సాయం శుభపరిణామం

అమరావతి,పోలవరం ప్రాజెక్టుల పూర్తికోసం సంపూర్ణ సహకారం అందిస్తామనడం సంతోషకరం.పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్థిక సాయం ఇవ్వడం వల్ల పారిశ్రామిక అభివృద్ధి పెరుగుతుంది..

- బొజ్జల సుధీర్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

రాజధానికి ఆసరా

కేంద్ర బడ్జెట్‌లో అమరావతి నిర్మాణానికి రూ. 15 వేల కోట్ల నిధులు కేటాయించడం సంతోషకరం. పోలవరం నిర్మాణానికి కూడా బడ్జెట్ బాసటగా నిలిచింది. విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు నిధులు కేటాయించడం హర్షదాయకం.

- చిన్నస్వామి నాయుడు, రిటైర్డు ఎకనామిక్స్ ప్రొఫెసర్

వెనకబడిన జిల్లాలకు నిధులివ్వడం సంతోషకరం

విద్య, నైపుణ్యాభివృద్ధికి రూ.లక్షన్నర కోట్లు,వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.1.52 లక్షల కోట్లు కేటాయించడం మంచి పరిణామం.ఐదేళ్ళలో నాలుగు కోట్ల మందికి ఉపాధి కల్పించడంతో పాటు ,స్వయం ఉపాధి పొందుతున్న చేతి వృత్తి మహిళలకు రుణ సాయం పెంచడం మంచి పరిమాణం.వెనుకబడిన జిల్లా కోటాతో అందే ప్రత్యేక నిధుల వల్ల మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఏర్పడుతుంది.

- కొండేటి సునీత, ఎస్వీయూ ఎకనమెట్రిక్స్ ప్రొఫెసర్

వరాలజల్లు

అమరావతి, పోలవరం నిర్మాణాలతో పాటు వ్యవసాయ రంగానికి తగిన విధంగా కేటాయింపులు చేసి ఏపీకి ప్రాధాన్యత ఇచ్చినందుకు ప్రధానమంత్రికి రాష్ట్ర ప్రజల తరపున ధన్యవాదాలు.మొత్తంగా చూసుకుంటే కూడా అత్యంత సమతుల్యమైన బడ్జెట్ ఇది.

- భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ నేత

విద్యారంగానికి కేటాయింపులు బాగున్నాయ్

వేతన జీవులకు స్వల్ప ఊరట లభించింది.ఏపీ అభివృద్ధికి పెద్దమొత్తంలో నిధులు కేటాయించడం హర్షణీయం. విద్యారంగానికి కూడా నిధుల కేటాయింపు సంతృప్తికరంగానే వుంది.

- ఎస్. బాలాజి, ఆపస్ అధ్యక్షుడు

ఉద్యోగులకు స్వల్ప ఊరట

నాలుగేళ్ల నుంచి ఆదాయపన్ను శ్లాబ్‌లో మార్పులేదు.ఈ బడ్జెట్‌లో స్టాండర్డ్ డైరెక్షన్ రూ.50వేల నుంచి 75వేలకు పెంచడం వల్ల ఉద్యోగులకు స్వల్ప ఊరట లభించింది.ఉద్యోగులకు మరింత లబ్ధి చేకూరేలా పాత విధానంలో కూడా మార్పులు చేసి ఉంటే బాగుండేది.

- కె.వెంకటరమణ,హెచ్ఎంల సంఘ అధ్యక్షుడు

నిరాశాపూరితం

పాత పన్నుల విధానంలో మార్పులు తీసుకురాకుండా కొత్త పన్నుల విధానంలో స్వల్ప మార్పులు చేయడంవల్ల వేతన జీవులకు ఈ బడ్జెట్ నిరుపయోగంగా మారింది. ఆదాయ పన్నుకు సంబంధించి కొత్త విధానంలో ఎక్కువ పన్ను చెల్లించాల్సిరావడంతో ఉద్యోగులందరూ మళ్లీ పాత విధానమే మేలనుకునే పరిస్థితి వచ్చింది. సీపీఎస్ విధానంలో మార్పులు చేస్తామని చెబుతూనే పాత పెన్షన్ విధానం అమలుపై ప్రకటన లేకపోవడం ఉద్యోగ ఉపాధ్యాయులను నిరాశపరిచింది. విద్యారంగానికి 6 శాతం బదులు 3.25 శాతం నిధులు కేటాయించడం విద్యారంగంపట్ల కేంద్రప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తోంది

- కె. ముత్యాలరెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

అప్పులు కాదు...గ్రాంట్ కావాలి

మన రాష్ట్రానికి కావాల్సింది అప్పులు కాదు, గ్రాంట్ ఇవ్వాలి. 90 శాతం గ్రాంట్‌గా ఇచ్చేదాన్నే ప్రత్యేక హోదా అంటారు. మనకేమో అప్పులు ఇస్తామంటున్నారు. మసిపూసి మారేడుకాయ చేశారు.ఇది పూర్తిగా అసంతృప్తికరమైన బడ్జెట్.

- చింతామోహన్, కాంగ్రెస్ నేత

ఆశాజనకం

పెరిగిన ధరలతో ఉద్యోగులు సతమతమవుతున్న రోజుల్లో బడ్జెట్ కేటాయింపులు ఊరటనిచ్చాయి. ఆదాయపన్ను శ్లాబ్ రేట్లను సవరించినందుకు కృతజ్ఞతలు .

- వరప్రసాద్ నైనార్, ఏపీ ఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షుడు

క్యాన్సర్ బాధితులకు ఉపశమనం

దేశవ్యాప్తంగా క్రమేపీ క్యాన్సర్ బాధితులు పెరుగుతున్నారు.తిరుపతిలో రుయాస్పత్రిలోనూ, స్విమ్స్ ఆస్పత్రిలోనూ అంకాలజీ విభాగాలున్నాయి. స్విమ్స్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఏర్పాటు పురోగతిలో వుంది. మరోవైపు జాతీయ స్థాయి ప్రాముఖ్యత కలిగిన టీటీడీ-టాటా సంయుక్త నిర్వహణలోని క్యాన్సర్ ఆస్పత్రి తిరుపతిలోనే వుంది. దీంతో జిల్లా నుంచే కాకుండా చుట్టుపక్కల జిల్లాలు, రాష్ట్రాల నుంచీ కూడా క్యాన్సర్ బాధితులు వైద్యం కోసం, వైద్య పరీక్షల కోసం ఇక్కడికి వస్తున్నారు. తాజా బడ్జెట్‌లో క్యాన్సర్ బాధితులు వినియోగించే మూడు ప్రధాన మందులపై జీఎస్టీ తొలగిస్తున్నట్టు ప్రకటించడంతో సంబంధిత మందుల ధరలు గణనీయంగా తగ్గనున్నాయి. ఈ నిర్ణయం పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన క్యాన్సర్ బాధితులకు ఉపశమనం కలిగించనుంది.

మహిళలకు వరం

మహిళలకు వరం : మహిళల పేరిట ఆస్తులు రిజిస్టర్ చేస్తే స్టాంపు డ్యూటీపై రాయితీని బడ్జెట్‌లో ప్రకటించారు. రిజిస్ట్రేషన్ వ్యయం గణనీయంగా తగ్గనున్న నేపథ్యంలో ఇక నుంచీ కుటుంబ ఆస్తులు, వ్యాపారపరంగా ఆస్తులను మహిళల పేరిట రిజిస్టర్ చేసే అవకాశం పెరిగే అవకాశాలున్నాయి. దీనివల్ల కుటుంబాల్లోనూ, రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లోనూ మహిళలకు ప్రాధాన్యత పెరగనుంది.అలాగే బడ్జెట్‌లో బంగారు, వెండిపై కస్టమ్స్ డ్యూటీని ఆరు శాతం తగ్గిస్తున్నట్టు ప్రకటించడంతో త్వరలో వాటి ధరలు కొంత మేరకు తగ్గే అవకాశం ఏర్పడింది.మహిళలకు ఈ పరిణామం కొంత ఊరటనివ్వనుంది.

వైసీపీ ఘనకార్యాలు

నీకొకటి...నాకొకటి..!

- స్విమ్స్‌లో రెండు మెడికల్ షాపులను పంచుకున్న టీటీడీ మాజీ ఛైర్మన్లు
- అనుచరుల పేరుతో చెరొక జనరిక్ షాపు
- ఎన్నికలకు ముందు మరో రెండేళ్లు పొడిగింపు
- నిర్వహణ మొత్తం నిబంధనలకు విరుద్ధం
- కొత్త ప్రభుత్వంలో అయినా అవి రద్దయ్యేనా?



తిరుపతి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ ఆధీనంలోకి స్విమ్స్ వచ్చీరాగానే రాజకీయ పెత్తనం పెరిగిపోయింది. జనరిక్ (జన ఔషధి)మెడికల్ షాపుల పేరిట అప్పటి టీటీడీ ఛైర్మన్లు వారి అనుచరులకు చెరొక మెడికల్ షాపును కట్టబెట్టారన్న విమర్శలు వెల్లువెత్తాయి. గడువు తీరిపోయినప్పటికీ ఎన్నికల నోటిఫికేషన్ ముందు జరిగిన టీటీడీ పాలకమండలి చివరి సమావేశంలో మరో రెండేళ్ల పాటు గడువు పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయంపై కూటమి నేతలు మండిపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న జనరిక్ మెడికల్ షాపులను రద్దుచేసేదిశగా అడుగులు వేయాలని కోరుతున్నారు.

ఔషధాలను తక్కువ ధరకే ప్రజలకు అందించాలన్న ఉన్నతమైన లక్ష్యంతో ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రుల్లో జనరిక్ (జన ఔషధి)మెడికల్ షాపులుండాలని ఏడేళ్లక్రితం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావించాయి. అవకాశం ఉన్నచోటంతా స్వచ్ఛంద సేవాసంస్థలకో, డ్వాక్రా మహిళా గ్రూపులకో మందుల షాపుల నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తూ వచ్చాయి. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత టీటీడీ ఛైర్మన్‌గా నియమితులైన వైవీ సుబ్బారెడ్డి సిఫారసుతో స్విమ్స్ ఓపీ విభాగంలో రవికుమార్‌కు 2021లో రూ.22వేల నామమాత్రపు అద్దెతో ప్రధాన్ మంత్రి భారతీయ జన ఔషధి కేంద్ర (పీఎంబీజేకే) జనరిక్ మెడికల్ షాపును కేటాయించారు. షాపు లక్ష్యాలను తుంగలో తొక్కి, ఇష్టారాజ్యంగా మందులను రోగులకు అంటగడుతున్నారన్న విమర్శలు తరచూ వినిపించాయి. ఈ నేపథ్యంలో స్విమ్స్ డైరెక్టర్ సూచన మేరకు పలుసార్లు పీఎంబీజేకే జనరిక్ షాప్‌లో నాణ్యతా ప్రమాణాల తనిఖీ (క్వాలిటీ ఆడిట్ చెక్)నిర్వహించగా..కాలం చెల్లిన మందులు, ఎక్స్‌పైరీ డేట్ దగ్గర పడిన మందులు షాపులో ఉన్నట్టు కమిటీ గుర్తించింది. అదేవిధంగా 90 శాతం ఉండాల్సిన జనరిక్ డ్రగ్స్ 30శాతానికి మించిలేవని తనిఖీల్లో తేటతెల్లమైంది. జనఔషధి మందులు ఉండాల్సిన చోట సర్జికల్ ఐటెమ్స్, ఆయుర్వేదిక్ ఉత్పత్తులు, పలురకాల బ్రాండెడ్ మందులే ప్రధానంగా షాపులో ఉంచినట్టు కమిటీ తేల్చింది. అర్హతగల ఫార్మసిస్టులు లేకపోవడంతో పాటు షాపు మొత్తం అపరిశుభ్రంగా ఉండడాన్ని కమిటీ సభ్యులు గుర్తించారు. హైరిస్క్ మెడిసిన్స్, ఎమర్జెన్సీ మందులు ప్రత్యేకంగా నిల్వచేయలేదని, మందుల షాపుకుండాల్సిన ప్రాథమిక లక్షణాలు కూడాలేవని తేల్చారు. వారంలో సమాధానం చెప్పాలని గతంలో షోకాజ్ నోటీసులు కూడా ఇచ్చారు. నివేదికను స్విమ్స్ డైరెక్టర్‌తో పాటు ఎస్‌పీబీహెచ్ సెల్‌కు కూడా పంపారు. అయినా అధికార పార్టీ పెద్దల అండ ఉండడం వల్ల ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.ఇక మరో షాపును టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి దగ్గర పనిచేసే సాయికుమారికి డ్వాక్రా సమాఖ్య కింద స్విమ్స్ పాత భవనం వద్ద కేటాయించారు. నెలకు రూ.24వేల అద్దెతో పొందిన ఈ షాపును ఇతరులకు లక్ష రూపాయలకు పైగా లీజుకిచ్చినట్టు సమాచారం. ఇందులో కూడా జనరిక్ మందులు లేకుండా బ్రాండెడ్ మందులు విక్రయిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. జనరిక్ మందులకు ఇవ్వాల్సిన డిస్కౌంట్‌ను కూడా సక్రమంగా ఇవ్వడంలేదని పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు కూడా అందాయి. ఇప్పటికైనా వీటి రెన్యువల్‌ను రద్దు చేసి నిబంధనల మేరకు కేటాయించాలని కూటమి పార్టీల నేతలు కోరుతున్నారు.

మీ ఆదరాభిమానాలే నన్ను రప్పించాయి

- కుప్పం పర్యటనలో నారా భువనేశ్వరి





కమ్మగుట్లపల్లెలో మహిళల ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న భువనేశ్వరి

కుప్పం/గుడుపల్లె, జూలై 23: 'కుప్పం నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ ఇచ్చిన రెండు పంచాయతీలను నేను దత్తత తీసుకుంటున్నా. వీటిని రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామాలుగా అభివృద్ధి చేస్తా' అని సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. తన నాలుగు రోజుల కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా మొదటి రోజైన మంగళవారం గుడుపల్లె మండలంలోని కమ్మగుట్లపల్లె, కంచిబందార్లపల్లె, కోటపల్లె, గుత్తార్లపల్లె గ్రామాలలో ఆమె పర్యటించారు. మహిళలతో ముఖాముఖి మాట్లాడారు.యువత ఉపాధికోసం మూడు పెద్ద పరిశ్రమలను తీసుకొస్తామని ప్రకటించారు. విద్యతోపాటు ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభించేలా చూస్తామన్నారు. చంద్రబాబుతో పనిలేకుండా తాను ప్రతి రెండుమూడు నెలలకోసారి కుప్పం వస్తానని, ఇక్కడి ప్రజల సాధకబాధకాలు తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో కుప్పం ప్రజలకు ఇచ్చిన ప్రత్యేక మ్యానిఫెస్టో అమలు చేయడానికి చంద్రబాబు కట్టుబడి ఉన్నారన్నారు. కుప్పం తన కుటుంబమని, అన్ని వేళలా ఇక్కడి ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నాయకులు పీఎస్ మునిరత్నం,డాక్టర్ సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల బదిలీలకు బ్రేక్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 23: అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగాన్ని రెండ్రోజుల కిందట గుర్తు తెలియని వ్యక్తులు కాల్చేసిన ఘటన తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణ కోసం వచ్చిన తహసీల్దార్లను రిలీవ్ చేయవద్దంటూ సీసీఎల్‌ఏ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ క్రమంలో మంగళవారం జిల్లాలో 34మంది పొరుగు జిల్లాల తహసీల్దార్లకు రిలీవ్ ఆర్డర్లను కలెక్టర్ వెంకటేశ్వర్ నిలుపుదల చేశారు. ఇక తహసీల్దార్ల బదిలీలు ఎపుడు ఉంటాయో అని పూర్తి స్పష్టత రాలేదు. అలాగే 2019 నుంచి ఐదేళ్ల కాలంలో జిల్లాలో వ్యవసాయ, ఇనాం, ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం, కన్వర్షన్‌చేసిన వివరాలపై జిల్లా అధికారులను సీసీఎల్ఏ కోరినట్లు తెలిసింది.

రాష్ట్రాన్ని ఆదుకునే బడ్జెట్ :బీజేపీ

రామచంద్రాపురం, జూలై 23: కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆదుకునే బడ్జెట్ అని బీజేపీ జిల్లా కార్యదర్శి కాయం హరినాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన రామచంద్రాపురంలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న పోలవరం పూర్తికి, రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని కేంద్ర ఆర్థికమంత్రి హామీఇచ్చారన్నారు. రాయలసీమ, కోస్తాంధ్ర, ప్రకాశం జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధుల కేటాయింపు ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రప్రజల తరపున ప్రధాని మోదీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పండుగ దినం: మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

అలుపెరగని నాయకుడు సీఎం చంద్రబాబు పోరాటం ఫలించబోతోంది. రాష్ట్రాభివృద్ధిలో ఆయన కన్న కల నిజంకాబోతోంది. రాజధాని నిర్మాణం కోసం రూ..15వేల కోట్లు నిధులు ప్రకటించడమే కాకుండా అవసరమైతే మళ్లీ ఇస్తామని కేంద్ర బడ్జెట్‌లో చెప్పడం ముదావహం. ఏపీ ప్రజలు మోదీని అభినందించదగ్గ పరిణామం.

కూటమి కృషి ఫలితం: టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ

టీడీపీ, జనసేన, బీజేపీ కలయిక, కృషి ఫలితంగానే కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి వరాల జల్లు కురిసింది. గత ఐదేళ్లుగా మన రాష్ట్రాన్ని మూడుముక్కలాటతో అభాసుపాల్జేశారు. అమరావతికి రూ.15వేల కోట్లు ప్రకటించడం ఆనందంగా ఉంది.

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దోహదం : టీడీపీ నేత సదాశివం

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కేంద్ర బడ్జెట్ దోహదపడనుంది. అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు నిధులు,ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి... ఇలా అన్ని విధాలుగా రాష్ట్రానికి మేలు జరగనుంది. సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏపీలో అభివృద్ధి పరుగులు పెట్టనుంది.

అన్ని గ్రామాల్లో వర్మీకంపోస్టు తయారీ

తిరుచానూరు, జూలై 23: గ్రామాల్లో పారిశుధ్యానికి పెద్దపీట వేస్తున్నామని, పంచాయతీ సిబ్బంది సేకరించిన తడి, పొడి చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలించి వర్మీకంపోస్టు తయారీ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని ఎస్‌డబ్ల్యూపీసీ జిల్లా కోఆర్డినేటర్ ఓ.శిరీష తెలిపారు. తిరుచానూరు పంచాయతీ ఆధ్వర్యంలో నడుస్తున్న చెత్త సంపద కేంద్రాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. తడిచెత్త, పొడి చెత్త వేరు చేసి వర్మీకంపోస్టు ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించాలని అధికారులకు సూచించారు. వర్మీకంపోస్టు తయారీలో క్లాప్ మిత్రలను భాగస్వాములుగా చేశామన్నారు. తిరుచానూరు పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌రాజు, భరత్‌కుమార్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

పాలిమరు మఠాధిపతికి చిన్నమర్యాద

తిరుచానూరు, జూలై 23: కర్ణాటక రాష్ట్రం ఉడిపిలోని పాలిమరు మఠాధిపతి విద్యాధీశతీర్థ స్వామి తన శిష్యబృందంతో కలిసి మంగళవారం తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. అదేవిధంగా పద్మావతి అమ్మవారిని జార్ఖండ్, తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్ దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

సుబ్రమణ్యం నాయుడి సేవలు గుర్తించండి: నాని



చంద్రగిరి, జూలై 23: చంద్రగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు విశిష్ట సేవలందించారని, ఆయనకు గుర్తింపు కలిగిన నామినేటెడ్ పదవి ఇవ్వాలని ఎమ్మెల్యే పులివర్తి నాని మంగళవారం మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. అమరావతిలో సుబ్రమణ్యం నాయుడిని వెంటబెట్టుకుని లోకేశ్‌ను నానీ కలిశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబును కూడా కలిసి సుబ్రమణ్యం నాయుడి సేవల గురించి వివరించారు. అలాగే 2022లో తుఫాన్ ప్రభావం వల్ల దెబ్బతిన్న తిరుచానూరు, తనపల్లె, రాయలచెరువు, ఐతేపల్లె బ్రిడ్జిల పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

నానీపై ఆరోపణలను ఖండిస్తున్నాం :టీడీపీ

తిరుపతి అర్బన్, జూలై 23: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీపై గత కొన్ని రోజులుగా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి చేస్తున్న ఆరోపణలను ఆర్‌సీపురం టీడీపీ మండల అధ్యక్షుడు జనార్ధన నాయుడు ఖండించారు. మంగళవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఐదేళ్లలో చేయలేని పనులు ఒకటిన్నర నెలలో ఎమ్మెల్యే నానీ పూర్తి చేశారని, అభివృద్ధిపై దృష్టిపెట్టారని స్పష్టం చేశారు. చెవిరెడ్డి కూటమి నేతలను ఇబ్బందులు పెట్టారని, తనపై కూడా ఎస్సీ, ఎస్టీ కేసులు బనాయించారని ఆరోపించారు. మునిబాబు, ప్రభాకర్ నాయుడు, శివశంకర్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో యువకుడి హఠాన్మరణం

● కుక్కల అరుపులతో గుర్తించిన గ్రామస్తులు



హేమంత్ (పాతచిత్రం)

రామచంద్రాపురం, జూలై 23: పొలం వద్దకు యువకుడు గుండెపోటుతో మృతి చెందగా, గ్రామానికి చెందిన కుక్కలు సంఘటనా స్థలంలో గట్టిగా శబ్ధం చేయడంతో గ్రామస్తులు మృతదేహాన్ని గుర్తించిన సంఘటన అనుపల్లి పంచాయతీలో మంగళవారం చోటు చేసుకుంది. రేకలచేను గ్రామానికి చెందిన హేమంత్(31) మంగళవారం ఇంటి నుంచి సమీపంలోని పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ ఏం జరిగిందో కాని వరి పొలంలో పడి కుప్పకూలాడు. గంట సేపటి తరువాత గ్రామానికి చెందిన కుక్కలు మృతదేహం వద్ద గట్టిగా శబ్ధం చేయడంతో గ్రామస్తులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. వరి పొలంలో అచేతనంగా పడి ఉన్న హేమంత్‌ను చూసి విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడనుకుని ఆశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకుని విద్యుదాఘాతంతో హేమంత్ మృతి చెందలేదని తేల్చారు. దీంతో అతడు గుండెపోటుతో మృతి చెందాడని గ్రామస్తులు నిర్ధారణకు వచ్చారు. ఈ లోపు సంఘటనా స్థలానికి చేరుకున్న రెవెన్యూ, పోలీసులు, 108 వాహనం వెనుదిరిగింది.

ఆధార్ నమోదు కేంద్రాల తనిఖీ

రామచంద్రాపురం, జూలై 23: మండలంలోని గంగిరెడ్డిపల్లి, మిట్టకండ్రిగ గ్రామ సచివాలయాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాలను ఎంఈవోలు మార్కొండయ్యనాయుడు, జయవేలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లందరికీ ఆధార్ నమోదు చేయించాలని సిబ్బందికి సూచించారు.

నెయ్యి నాణ్యతను వంద శాతం పరీక్షించే ల్యాబ్ త్వరలో ఏర్పాటు

- టీటీడీ ఈవో శ్యామలరావు -

తిరుమల, జూలై23(ఆంధ్రజ్యోతి): నెయ్యి నాణ్యతను వంద శాతం పరీక్షించే ల్యాబ్‌ను ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆధ్వర్యంలో త్వరలో ఏర్పాటు చేస్తామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో మంగళవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. నాణ్యమైన నెయ్యి ద్వారా లడ్డూ నాణ్యత పెరుగుతుందని నిపుణులు తెలిపారన్నారు. అయితే ప్రస్తుతానికి తిరుమలలో ఉన్న ల్యాబ్ ద్వారా అడల్ట్రేషన్ టెస్ట్ చేసే పరికరాలు లేవన్నారు. త్వరలో అధునాతన యంత్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ముడిసరుకులు, నెయ్యి ప్రొక్యూర్మెంట్ విధానాల్లో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, వాటిని త్వరలో సరిచేస్తామన్నారు.సప్లయర్స్‌ను పిలిచి క్వాలిటీ నెయ్యి సరఫరా చేయాలని సూచించామన్నారు. సర్టిఫికేషన్ ఉన్న సంస్థలకే నెయ్యి సరఫరాకు అనుమతిస్తున్నప్పటికీ నాణ్యతలో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. టీటీడీకి సరఫరా చేస్తున్న నెయ్యి నమూనాలను క్షుణ్ణంగా పరీక్షించేందుకు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్‌కు పంపినట్టు తెలిపారు. టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్న ఐదుగురు సరఫరాదారుల్లో ఒకరు అందించిన నెయ్యి కల్తీ అని నిర్ధారణ జరిగిందన్నారు.తక్కువ నాణ్యత కలిగిన నెయ్యిని సరఫరా చేస్తున్న సరఫరాదారులు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.లడ్డూలతో పాటు వివిధ రకాల ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యి కొనుగోళ్లకు డెయిరీ ఫీల్డ్‌లో నిపుణులైన నలుగురు సభ్యులతో జూలై 2వ తేదీన కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇందులో ఎన్‌డీఆర్ఐ మాజీ ఆచార్యులు డాక్టర్ సురేంద్రనాథ్, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ విజయభాస్కర రెడ్డి, ప్రొఫెసర్ స్వర్ణలత, బెంగళూరుకు చెందిన డాక్టర్ మహదేవన్ ఉన్నారని తెలిపారు. ఈ కమిటీ వారంరోజుల్లో నివేదిక అందిస్తుందన్నారు. క్వాలిటీ నెయ్యి కోసం టెండర్‌లో ఎలాంటి అంశాలు చేర్చాలనేది ఈ కమిటీ దిశానిర్దేశం చేస్తుందన్నారు. నెయ్యికి సువాసన చాలా అవసరమని, వీటి ద్వారా రేటింగ్ వేయడానికి నివేదిక ఇవ్వాలని కమిటీని కోరినట్టు వివరించారు.

అనుమానాస్పద స్థితిలో ఆటోడ్రైవర్ మృతి

● పోలీసుల అదుపులో మృతుడి భార్య





మృతుడు నరేష్ - మృతుడి భార్య ధనలక్ష్మిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

తిరుచానూరు, జూలై 23: అనుమానాస్పద స్థితిలో ఆటోడ్రైవర్ మృతి చెందిన సంఘటన తిరుపతి రూరల్ మండలం పాడిపేట శివపురం కాలనీలో చోటు చేసుకుంది. మృతుడి సోదరుడు ఈశ్వరయ్య కథనం మేరకు వివరాలు... ఏర్పేడు మండలం ముసలిపేడు హరిజనవాడకు చెందిన నరేష్(35)కు తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకానికి చెందిన ధనలక్ష్మితో పదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. నరేష్ ముసలిపేడులో నివాసం ఉంటూ తిరుచానూరుకు వచ్చి ఆటో నడుపుకుని తిరిగి రాత్రికి ఇంటికి వెళ్లేవాడు. ముసలిపేడు హరిజనవాడకు చెందిన ఓ యువకుడితో అతడి భార్య వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. దీంతో తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో నరేష్ తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాడిపేట శివపురం కాలనీలో రెండు వారాల క్రితం ఇంటిని అద్దెకు తీసుకుని భార్య, బిడ్డలతో మకాం మార్చాడు. తిరుచానూరులోనే ఆటో తోలుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం వేకువజామున అద్దెకు ఉన్న ఇంటి వరండాలో నరేష్ ఉరితాడుకు వేలాడుతూ విగతజీవుడై కనిపించాడు. గుర్తించిన స్థానికులు పోలీసులకు, మృతుడి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. పోలీసులు వెళ్లేటప్పటికే మృతుడి భార్య ధనలక్ష్మి, మరి కొందరు కలిసి రేకుల పైకప్పుకు చీరతో వేలాడుతున్న మృతదేహాన్ని కిందకు దించి పడుకోబెట్టారు. విషయం తెలుసుకున్న తిరుచానూరు సీఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలను సేకరించారు. మృతుడి కుటుంబీకులు, స్థానికులు నరేష్ భార్య ధనలక్ష్మిపై అనుమానం వ్యక్తం చేయడంతో ఆమెను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తన తమ్ముడి మరణం విషయంలో మరదలు ధనలక్ష్మి, తమ గ్రామానికి చెందిన హరిపై అనుమానం ఉందని, వారిపై సత్వర చర్యలు తీసుకోవాలని ఈశ్వరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. నరేష్ మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రుయా మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఇదిలా ఉంటే తమ ఇంటికి రాత్రి హరి బాబాయ్ వచ్చాడని.. అమ్మ, అతడు కలిసి నాన్న ముఖంపై దిండుతో అదిమారని.. తరువాత చీరతో వేలాడదీశారని పోలీసులకు మృతుడు నరేష్ కుమార్తె ఏడేళ్ల చిన్నారి చెప్పినట్లు తెలిసింది. తన భార్యకు వేరే యువకుడితో వివాహేతర సంబంధం ఉండటంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడా..? లేకా భార్య, ఆమె ప్రియుడి చేతిలో హత్యకు గురయ్యాడా..? అన్న విషయం పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఈ సంఘటన పాడిపేటలో తీవ్ర సంచలనం రేకెత్తించింది.

27నుంచి ఆనందగిరిలో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు

పాకాల, జూలై 23: పాకాల మండలం ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరి (పాళ్యంకొండ)పై వెలసిన వళ్లీ దేవసేన సమేత కళ్యాణ సుబ్రమణ్యస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల గోడపత్రిక, కరపత్రాలను ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలను పార్టీలకతీతంగా అందరి సహకారంతో ఘనంగా నిర్వహించాలన్నారు. బ్రహ్మోత్సవాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. మండల టీడీపీ కన్వీనర్ బి.నాగరాజ నాయుడు, జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సోంపల్లి చంద్రశేఖర్ నాయుడు, సభ్యులు, ఈవో యువరాణి, సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'కారుణ్యం' చూపని గౌతమ్‌తేజ్!

● చిత్తూరులో పనిచేసినపుడు కారుణ్య నియామకాలకు భారీగా వసూళ్లు

● ఇప్పుడు మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో రికార్డులు కాలిన ఘటనలో నిందితుడు



చిత్తూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టరు కార్యాలయంలో 22(ఏ) సెక్షన్‌లో రికార్డులను ఉద్దేశపూర్వకంగా కాల్చారని ఉన్నతాధికారులు నిర్ధారించిన ఘటనలో నిందితుడైన గౌతమ్‌తేజ్ కెరీరంతా అవినీతిమయమే. ఆ సెక్షన్ క్లర్కు (సీనియర్ అసిస్టెంట్) అయిన ఇతడు 'కారుణ్య' నియామకం ద్వారా చిత్తూరు కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా చేరారు. కారుణ్య నియామక విభాగానికి ఇన్‌ఛార్జిగా పనిచేశారు. ఇతడి కెరీర్ అవినీతిమయమేనని రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది. డబ్బులిస్తే ఏ పనైనా చేస్తాడని అంటున్నారు. కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగంలో చేరిన ఇతడు ఏమాత్రం 'కారుణ్యం' చూపేవాడు కాదంటూ ఐదేళ్ల కిందటి ఘటనను ఇప్పుడు గుర్తుచేసుకుంటున్నారు. కారుణ్య నియామక విభాగానికి ఇన్‌ఛార్జిగా పనిచేసేటప్పుడు 2019 జూలైలో సుమారు 25 మంది అభ్యర్థుల వద్ద రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేశారు. అంటే, ఉద్యోగి అయిన తండ్రి చనిపోయి బాధలో ఉన్న ఆ కుటుంబం నుంచి నిర్దాక్షిణ్యంగా డబ్బు వసూలు చేశాక ఫైల్‌ను ప్రాసెస్ చేసేవారన్న ఆరోపణలున్నాయి. దీనిపై 2019 జూలైలో 'ఆంధ్రజ్యోతి'లో కథనం కూడా ప్రచురితమైంది. ఇప్పుడు మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో దుండగులు రికార్డులు కాల్చిన 22(ఏ) సెక్షన్‌కు సంబంధించి గౌతమ్‌తేజ్ ఇప్పుడు క్లర్కుగా పనిచేస్తున్నారు. ఇతడి గత వ్యవహార శైలిని పరిశీలించిన రెవెన్యూ వర్గాలు అనేక అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. కాగా, ఈ ఘటనలో పలువురు సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బందిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వీరిలో గౌతమ్‌తేజ్ కూడా ఉన్నారు. పోలీసుల విచారణలో అతడు ఏదీ ఒప్పుకోలేదని తెలుస్తోంది.

వైసీపీ విధేయులకు 'కో ఆపరేషన్' !

తిరుపతి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం చేపట్టిన వారికి ఎస్వీయూ కో-ఆపరేటివ్ స్టోర్ బాధ్యతలు అప్పగించాలని జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇచ్చిన సిఫారసు లేఖ విమర్శలకు తావిస్తోంది. కోట్లాది రూపాయల టర్నోవర్ కలిగిన ఎస్వీయూ కోఆపరేటివ్ స్టోర్‌కు ఎన్నికలు నిర్వహించకుండానే కమిటీ వేసేందుకు ఎమ్మెల్యే గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం, అందులోనూ వైసీపీకోసం పనిచేసినవారికి చైర్మన్‌గిరీ కట్టబెట్టాలని చూడడం దుమారం రేపుతోంది.వైసీపీ అభ్యర్థి భూమన అభినయ్ నిర్వహించిన ఆత్మీయ సమావేశాల్లో ఎస్వీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ రమేష్ బాబు చురుగ్గా పాల్గొన్నారు. ప్రస్తుతం ఇతడినే చైర్మన్‌గా ఎమ్మెల్యే సిఫారసు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ కో-ఆపరేటివ్ సొసైటీస్ విభాగపు కమిషనర్‌కు లేఖ రాశారు. అదేవిధంగా ఎన్నికల వరకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సభల్లో కనిపించి ఇటీవల టీడీపీలో చేరిన మరో ఉద్యోగి నాగరాజ రెడ్డిని కార్యదర్శిగా సిఫారసు చేశారు. అధ్యక్ష, కార్యదర్శులతో కలిపి మొత్తం 13 మంది కమిటీ సభ్యుల జాబితాలో కేవలం ఇద్దరు మాత్రమే టీడీపీ, జనసేన సానుభూతిపరులని తెలుస్తోంది.

బస్టాండుల్లో మరమ్మతులు చేపట్టండి: డీపీటీవో

తిరుపతి(ఆర్టీసీ), జూలై 23: శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న దృష్ట్యా జిల్లాలోని అన్ని బస్టాండుల్లో మరమ్మతులు చేపట్టాలని అధికారులను ప్రజారవాణాధికారి (డీపీటీవో) చెంగల్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో అన్ని డిపోల అధికారులు, అద్దె బస్సుల యజమానులతో సమీక్షించారు.కార్గో సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేలా కృషి చేయాలన్నారు.

టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై విచారణ వేగవంతం చేయండి

తిరుపతి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మాస్టర్ ప్లాన్ రోడ్ల వెనుక జరిగిన టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై విచారణ వేగవంతం చేసి, త్వరగా చర్యలు తీసుకోవాలని టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ కోరారు. ఈమేరకు విజయవాడలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి, సత్కరించారు. తిరుపతిలో యూడీఎస్‌ను ఆధునీకరించాలని, వైసీపీకి తొత్తులుగా వ్యవహరించిన మున్సిపల్ ఉద్యోగుల బదిలీలపై తగు నిర్ణయం తీసుకోవాలని ఈసందర్భంగా ఆమె విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ సిటీ నిధులు సకాలంలో వచ్చేలా ప్రయత్నించాలన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్టు తెలిసింది.

ప్రాజెక్టులు నిర్మించండి: సీపీఐ

తిరుపతి(ఆటోనగర్), జూలై 23: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ప్రాజెక్టులు నిర్మించి అభివృద్ధికి దోహదపడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి కోరారు. బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన జిల్లా సమితి సమావేశంలో ఆయన ప్రసంగించారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం మూడో పర్యాయం అధికారంలోకి వచ్చినా రాష్ట్రానికి నిధుల కేటాయింపులో అన్యాయం చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర విభజన జరిగినప్పటి నుంచి పాలక ప్రభుత్వాలు ఒక సాగునీటి ప్రాజెక్టు కూడా పూర్తి చేయకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రకమిటీ సభ్యుడు రామానాయుడు మాట్లాడుతూ.. రాష్ట్ర రాజధానికి బీజేపీ ప్రభుత్వం నామమాత్రపు నిధులు కేటాయించి గొప్పలు చెప్పుకోవడం దారుణమన్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలు మౌలిక వసతుల్లేక దుర్గంధభరితంగా ఉన్నాయని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ కార్యకర్తలు పోరాటాలకు సిద్ధంగా కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల మృతి చెందిన పార్టీ నాయకులకు సంతాప తీర్మానాన్ని పెంచలయ్య ప్రవేశ పెట్టారు.

కార్మికశాఖాధికారి బాలునాయక్‌కు సన్మానం

తిరుపతి అర్బన్, జూలై 23: తిరుపతి లేబర్ ఆఫీసర్ ఎం.బాలునాయక్ పదోన్నతిపై కర్నూల్ జోన్ జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఏపీ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.సుధాకర్ మంగళవారం సన్మానించారు.

జిల్లా వ్యాప్తంగా నాకాబందీ

తిరుపతి(నేరవిభాగం), జూలై 23: జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో మంగళవారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. వాహనాలు తనిఖీ చేశారు. లైసెన్సులు లేనివారికి అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలని ఏఎస్పీ కులశేఖర్ సూచించారు. ద్విచక్ర వాహనదారులంతా హెల్మెట్ ధరించాలని చెప్పారు.

1.100 కిలోల గంజాయి స్వాధీనం: ఇద్దరి అరెస్టు

తిరుపతిలో విక్రయించడానికి సిద్ధంగా ఉన్న 1.100 కిలోల గంజాయిని అలిపిరి సీఐ జయనాయక్ మంగళవారం స్వాధీనం చేసుకున్నారు.అనుమానాస్పదంగా కనిపించిన రైల్వే కోడూరుకు చెందిన సుమన్, జీవకోనకు చెందిన జగదీష్‌లను విచారించగా.. వారి వద్ద దాదాపు 1.100 కిలోల గంజాయి బయటపడింది.

తూపిలిపాళెం బీచ్‌లో గుర్తించిన భూమిని పర్యాటకశాఖకు అప్పగించండి: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 23: తూపిలిపాళెం బీచ్‌లో గుర్తించిన భూమిని పర్యాటకశాఖకు త్వరగా అప్పగించడానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు.వాకాడు మండలంలోని ఈ బీచ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి 6.50 ఎకరాల భూమిని నిబంధనల మేరకు పర్యాటకశాఖకు అప్పగించడానికి చర్యలు చేపట్టాలని తహసీల్దారును ఆదేశించారు.

శ్రీవారి ఆర్జిత సేవలకు ఫేక్ ఆధార్లతో 400 రిజిస్ట్రేషన్లు

● ఇద్దరిని అదుపులోకి తీసుకున్న విజిలెన్స్

తిరుమల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆర్జిత సేవలను పొందేందుకు 400 సార్లు రిజిస్ట్రేషను చేసిన ఇద్దరు వ్యక్తులను టీటీడీ విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. శ్రీవారి ఆర్జితసేవలకు సంబంధించిన లక్కీడిప్ కోటాను టీటీడీ ప్రతినెలా ఆన్‌లైన్ ద్వారా విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సేవల కోసం గుంటూరు జిల్లా చుండూరుకు చెందిన సాయిసునీల్, ఏవీఎస్ గుప్తా అనే ఇద్దరు సోదరులు పేరు, చిరునామాలను అలానే ఉంచి ఆధార్ నెంబర్లను మారుస్తూ అధిక సంఖ్యలో రిజిస్ట్రేషను చేసుకున్నారు. ఇలా ఇప్పటి వరకు దాదాపు 400కు పైగానే రిజిస్ట్రేషన్లు చేసినట్టు విజిలెన్స్ అధికారుల విచారణలో తేలింది. ఇలా పొందిన సుప్రభాతసేవలో పాల్గొనేందుకు మంగళవారం వేకువజామున వారు తిరుమలకు రాగా విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకుని విచారించారు. అసలు ఆధార్ కార్డును పరిశీలించడంతో వీరి అక్రమం స్పష్టమైంది. ఇలా ఫేక్ ఆధార్లతో నాలుగు సేవలు పొందగా, మొదటిసేవలో పాల్గొనేందుకు వచ్చిన వీరిని తిరుమల టూటౌన్ పోలీసులకు అప్పగించారు. ఒకే నెంబరు, మెయిళ్ల ద్వారా బల్క్ రిజిస్ట్రేషన్లు చేస్తున్న వారిపై టీటీడీ నిఘా పెట్టిన విషయం తెలిసిందే. ఈక్రమంలోనే వీరిద్దరు పట్టుబడ్డారు.

టీటీడీలో గత ఐదేళ్ల నిర్ణయాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి:బీజేపీ

తిరుమల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో టీటీడీ ధర్మకర్తల మండలి తిరుమల ధార్మిక క్షేత్రాన్ని ధనార్జన క్షేత్రంగా మార్చుకుందని బీజేపీ నేత భానుప్రకాష్ రెడ్డి ఆరోపించారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో టీటీడీ చైర్మన్లుగా ఉన్న వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర రెడ్డి తీసుకున్న నిర్ణయాలను టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌లో పెట్టనప్పుడే భక్తుల్లో అనేక అనుమానాలు వచ్చాయన్నారు.స్వామిసేవకు అని వచ్చిన వీరు సొంతసేవలు చేసుకున్నారన్నారు. గత ఐదేళ్లలో బోర్డు తీసుకున్న నిర్ణయాలను ఎస్వీబీసీ ద్వారా భక్తులకు తెలియజేయడంతో పాటు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడిన వారు ఎంతటివారైనా క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించండి: యూటీఎఫ్

తిరుపతి(విద్య), జూలై 23: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి తదితర నాయకులు మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్వో పెంచల కిషోర్‌ను కలిసి ఈమేరకు వినతిపత్రం సమర్పించారు. ప్రీ ప్రైమరీతోపాటు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఒకే పాఠశాలలో నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. మొత్తం 20 అంశాలను పరిష్కరించాలన్నారు. దేవరాల నిర్మల, కందల శ్రీదేవి, బండి మధుసూదన్‌రెడ్డి, సి.సురేష్, దండు రామచంద్రయ్య, అవనిగడ్డ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు నిర్వహించాలి: టీఎన్ఎస్ఎఫ్



అప్పారావుకు విన్నవిస్తున్న నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 23:ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను నిర్వహించాలని ఇన్‌చార్జి వీసీ అప్పారావును టీఎన్ఎస్ఎఫ్ కోరింది. దీనిపై ఆయనకు టీఎన్ఎస్ఎఫ్ నేత ఆర్కే నాయుడు వినతిపత్రం అందజేశారు. స్పందించిన వీసీ, రెండో దశ కౌన్సెలింగ్‌లో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల్లో ప్రవేశాలు చేపడతామని హామీ ఇచ్చారు. నాయకులు లక్ష్మన్న, వంశీ, రవి, గణేష్, రాజు, భీమేష్, పాల్గొన్నారు.

నూతన అధికారులకు సన్మానం



ఉమతో ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ప్రతినిధులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 23: తిరుపతిలోని యూనివర్సిటీల్లో నూతన అధికారులను తిరుపతి ఫైన్ ఆర్ట్స్ అకాడమీ సత్కరించింది. ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, పద్మావతి వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఉమ, వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ రమణలను సత్కరించారు. అకాడమీ కార్యదర్శి పొండ్ర సురేంద్ర నాయుడు, కోశాధికారి ప్రొఫెసర్ కృష్ణమాచార్యులు, ఉపాధ్యక్షులు ఏపీ నాయుడు, సంయుక్త కార్యదర్శి డాక్టర్ డి. ఉదయ కుమార్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానానికి జరిమానా

చంద్రగిరి, జూలై 23: బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే రూ.200 జరిమానా తప్పదని పోలీస్ శాఖ హెచ్చరిస్తుంది. గతంలో రూ.100 ఉండగా, ఇప్పుడు రూ.200 చేశారు. ఈనెల ఒకటో తేది నుంచి ఈ చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని పోలీస్‌శాఖ ఆదేశాలు జారీ చేసింది.

తిరుమలలో తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్

తిరుమల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ శ్రీవారి దర్శనార్థం మంగళవారం తిరుమలకు వచ్చారు. తిరుమలలోని గాయత్రి నిలయం గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న ఆయనకు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి బస ఏర్పాటు చేశారు. గవర్నర్ బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

కల్యాణకట్టలో పరిశుభ్రత ఇంకా మెరుగవ్వాలి

● ఈవో శ్యామలరావు



తిరుమల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి కల్యాణకట్టలో పరిశుభ్రత ఇంకా మెరుగుపరచాలని, తలనీలాలు సమర్పించే భక్తులకు నిరంతరాయంగా వేడినీరు అందించేలా చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుమలలోని ప్రధాన కల్యాణకట్టలో మంగళవారం సాయంత్రం జేఈవో గౌతమితో కలిసి భక్తులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. కల్యాణకట్టలో అత్యంత పాత గీజర్లు, పగిలిన టైల్స్, విరిగిన నీటి కొళాయిలను వెంటనే మార్చాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, ఎలక్ట్రికల్, ఇతర ఇంజనీరింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం వెంగమాంబ అన్నప్రసాద కేంద్రాన్ని తనిఖీ చేశారు. అన్నం బాగా ఉండికిందా, కూరలు ఎలా ఉన్నాయని భక్తులను అడిగి తెలుసుకున్నారు. భక్తులు సంతృప్తి వ్యక్తం చేయడంలో ఈవో ఆనందించారు. ఈకార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీఈవో రాజేంద్ర, ప్రత్యేకాధికారి శాస్త్రి, హెల్త్ డిప్యూటీఈవో ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ నిబంధనల మేర వాటర్ బాటిళ్లు విక్రయించాలి

తిరుమల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు టీటీడీ నిర్దేశించిన రేట్లకే వాటర్ బాటిళ్లు విక్రయించాలని జేఈవో గౌతమి స్పష్టం చేశారు. తిరుమలలోని ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం ఈవో ఆదేశాల మేరకు దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. జేఈవో మాట్లాడుతూ.. తిరుమలలోని దుకాణదారులు ఒకే ధరతో వాటర్ బాటిళ్లు విక్రయించాలని, ఖాళీ బాటిల్ తీసుకుని డబ్బులు తిరిగి ఇవ్వాలన్నారు. దుకాణాల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆరోగ్యశాఖ డిప్యూటీఈవో ఆశాజ్యోతి, ఇంచార్జ్ హెల్త్‌ఆఫీసర్ సునీల్‌కుమార్, ఇతర అధికారులు, దుకాణదారులు పాల్గొన్నారు.

పురాతన శివాలయాన్ని చదును చేశారు

● విగ్రహాలను భద్రపరచిన గ్రామస్తులు





చదునుచేసిన పురాతన చిన్నశివాలయం - భద్రపరచిన శివలింగం, నాగలక్ష్మి

నాయుడుపేట, జూలై 23: దాదాపు 500 సంవత్సరాల నాటి పురాతనమైన శివాలయం పక్కన ఉన్న చిన్న శివాలయాన్ని గుర్తుతెలియని వ్యక్తులు చదును చేసేశారు. ఆ ఆలయంలోని విగ్రహాలను పక్కన పడేయడంతో వాటిని గ్రామస్తులు మంగళవారం గుర్తించారు. నాయుడుపేట మండలం పుదూరులోని పొలాల సమీపంలో అతి పురాతనమైన శివాలయం ఉంది. గతంలో గుప్త నిధుల కోసం ఆగంతకులు ఆ ఆలయం వద్ద తవ్వకాలు కూడా చేపట్టారు. ఈ ఆలయానికి సమీపంలో చిన్న శివాలయం, నాగలక్ష్మిపుట్ట ఉన్నాయి. అక్కడ తవ్వకాలు చేపట్టాలనుకున్నారో ఏమో ఆ చిన్నగుడిని పూర్తిగా తొలగించేశారు. ఈ సంఘటనపై గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

తప్పిన ముప్పు

● డివైడర్‌పైకి భారీ లారీ



తిరుచానూరు, జూలై 23: డ్రైవర్ నిర్లక్ష్యానికి అతివేగం తోడై లారీ(ట్రాలీ) అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లిన ఘటన దామినేడు వద్ద చోటు చేసుకుంది. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోని దామినేడు వద్ద మంగళవారం సాయంత్రం డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో లారీ అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లి ఆగిపోయింది. జాతీయ రహదారిలో డివైడర్ లేదంటే రాంగ్‌రూట్‌లో వెళ్లి ఎదురుగా వెళ్లే వాహనాలను ఢీకొని ఉంటే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండేది. దీంతో భారీ ముప్పు తప్పింది. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని తిరుచానూరు పోలీసులు తెలిపారు.

మదనపల్లెలో చిత్తూరు, తిరుపతి కలెక్టర్లు

చిత్తూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో దుండగులు రికార్డులు కాల్చిన ఘటనపై మంగళవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా అక్కడికి మదనపల్లెకు వెళ్లి ఈ ఘటనపై లోతుగా విచారించారు. ఈ క్రమంలోనే చిత్తూరు, తిరుపతి కలెక్టర్లు సుమిత్‌కుమార్, వెంకటేశ్వర్లు కూడా మంగళవారం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి హాజరయ్యారు. సిసోడియాతో మాట్లాడారు. ఈ ఘటనపై ఇద్దరు కలెక్టర్లకు కీలక విచారణ బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఇద్దరు కలెక్టర్లు మంగళవారం నుంచే తమకు అప్పగించిన బాధ్యతల్ని అమలు చేయడం ప్రారంభించినట్లు సమాచారం. కాగా, జిల్లాల విభజనకు ముందు పుంగనూరు, కుప్పం, పలమనేరు నియోజకవర్గాలు మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండేవి. దీంతో పుంగనూరు నియోజకవర్గ రికార్డులు ఇంకా మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఉండే అవకాశాలున్నాయని సమాచారం. గత ఐదేళ్లలో పెద్దిరెడ్డి కుటుంబం అనేక ప్రాంతాల్లో భూఅక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. అదే సమయంలో మంగళవారం పెద్దిరెడ్డి ప్రధాన అనుచరుడు మాధవరెడ్డి ఇంట్లో అధికారుల సోదాల్లో రెండు సంచుల రికార్డులు బయటపడ్డాయి. దీంతో కాలిపోయిన రికార్డులకు, జిల్లాకూ లింకు ఉందా అనే దిశగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మదనపల్లె మాజీ ఆర్డీవో విచారణ

తిరుపతి(నేరవిభాగం), జూలై 23 : మదనపల్లె ఆర్డీవోగా పనిచేసి ప్రస్తుతం తిరుపతి కలెక్టరేట్‌లో రెవెన్యూ లీగల్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న మురళీని పోలీసులు సోమవారం మదనపల్లెకు విచారణ నిమిత్తం రప్పించారు.మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాల యంలో ఆదివారం రాత్రి జరిగిన ప్రమాద ఘటనలో కీలక రికార్డులు అగ్నికి ఆహుతైన కేసుకు సంబంధించి డీఎస్పీ ప్రసాద రెడ్డి, ప్రత్యేక బృందాలు మంగళవారం విచారణ చేపట్టాయి. బుధవారం మళ్ళీ విచారణ నిమిత్తం మురళిని మదనపల్లెలోనే అందుబాటులో వుండాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయనతో పాటు తిరుపతికి చెందిన మరో నలుగురు అధికారులను మదనపల్లె పోలీసులు అక్కడకు రప్పించి విచారణ చేస్తున్నారు.

15నాటికి అన్న క్యాంటీన్లు ప్రారంభం కావాలి

● మున్సిపల్ కమిషనర్లకు కలెక్టర్ ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), జూలై 23: అన్న క్యాంటీన్లను జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల పరిధిలో వచ్చే నెల 15వ తేదీనాటికి తప్పకుండా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. జిల్లాలో 11 అన్న క్యాంటీన్లు ప్రారంభించాలని, అందుకు తగిన చర్యలు ఇప్పటి నుంచే చేపట్టాలని సూచించారు. తిరుపతి, శ్రీకాళహస్తి, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరిలో అన్న క్యాంటీన్ల కోసం గుర్తించిన భవనాల మరమ్మతులు త్వరగా పూర్తిచేయాలని చెప్పారు. అయితే పుత్తూరులో క్యాంటీన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కొత్త నిర్మాణం చేపట్టడానికి టెండర్లు పిలిచామని, సమయం పడుతుందని కమిషనర్ తెలిపారు. మరమ్మతులు, భవన నిర్మాణాల పురోగతిపై ఎప్పటికపుడు సమీక్షించి.. సకాలంలో పనులు పూర్తయ్యేలా చూడాలని కమిషనర్లకు కలెక్టర్ ఆదేశాలిచ్చారు. డీఆర్వో పెంచలకిషోర్, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సెక్షన్ డీటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం: టీడీపీ


మీడియాతో మాట్లాడుతున్న నరసింహ యాదవ్

తిరుపతి అర్బన్, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యమివ్వడం హర్షణీయమని తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రానికి ప్రాధాన్యత ఇవ్వడంపై సీఎం చంద్రబాబు మార్కు పరిపాలన స్పష్టంగా వ్యక్తమవుతోందన్నారు. ఇక అమరావతి రాజధాని, పోలవరం నిర్మాణం పుంజుకోవడం ఖాయమని చెప్పారు. చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రాభివృద్ధికి చేయూతనిస్తున్న ప్రధాని మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర పాలనను గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నారని కొనియాడారు. మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో అగ్నిప్రమాద ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. అక్రమాలకు కేంద్ర బిందువైన జగన్, పెద్దిరెడ్డిలకు శిక్ష తప్పదన్నారు.

తోపుడు బండ్ల వ్యాపారులకు గుర్తింపు కార్డులివ్వాలి : సీఐటీయూ


సమావేశంలో ప్రసంగిస్తున్న కందారపు మురళి

తిరుపతి(ఆటోనగర్), జూలై 23: తోపుడు బండ్ల వ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరిగిన వీధి వర్తక వ్యాపారుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ట్రాఫిక్ పోలీసుల దౌర్జన్యాలు, దాడులను ఖండించారు. ఒప్పందానికి విరుద్ధంగా గేటు పేరుతో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ పాలనలో నగరంలో మొబైల్ టిఫిన్ సెంటర్లు రావడంతో వీధి వ్యాపారులు నష్టపోయారని జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రమణ్యం అన్నారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి 50 రోజులు గడవక ముందే వ్యాపారులపై నాయకులు అక్రమ వసూళ్లు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నగర పాలక అధికారులు, పోలీసులు, కాంట్రాక్టర్ల తీరు మారకంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు మాధవ కృష్ణ, వేణుగోపాల్, బుజ్జి, మాధవి,మణిమాల, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్మిత సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి : పీడబ్ల్యూడీఎఫ్

తిరుపతి అర్బన్, జూలై 23: తెలంగాణ సీనియర్ ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని పర్సన్ విత్ డిజేబుల్ ఫెడరేషన్ (పీడబ్ల్యూడీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండమర్రి సుబ్రహ్మణ్యం, పద్మావతి మహిళా వర్సిటీ ప్రొఫెసర్ తులసి డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ.. అఖిల భారత సర్వీసులో ఉండి దివ్యాంగుల రిజర్వేషన్‌ను రద్దు చేయాలనడం సభ్యతగా లేదన్నారు. ఇది తమను కించపరిచేలా, మనోభావాలు దెబ్బతినేలా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మాటలు 24గంటల్లోగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంకటరమణ, అమరేశ్వరి, మధులత, లక్ష్మీనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఐసీడీఎస్‌లో ఉద్యోగంపై ఫోన్ వస్తే స్పందించవద్దు'

తిరుపతి(కలెక్టరేట్), జూలై 23: స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని ఆశాఖ అధికారి జయలక్ష్మి తెలిపారు. అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరచడం జరిగిందన్నారు. తదుపరి కమిటీ సభ్యుల ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. ఈలోపు అభ్యర్థులకు అజ్ఞాత వ్యక్తులు 85829 59429 నెంబరునుంచి ఫోన్ చేసి మీకు ఉద్యోగం ఖరారైందని డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిసిందని పేర్కొన్నారు. ఇటువంటి వారి మాటలను నమ్మొద్దని, ఇలా ఎవరైనా ఫోన్ చేస్తే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని అభ్యర్థులకు సూచించారు.

బీసీ-ఏలో చేర్చండి : ముదిరాజు మహాసభ

తిరుపతి అర్బన్, జూలై 23: తమను బీసీ-ఏలో చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ఏపీ ముదిరాజు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ ముదిరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇదే విషయమైన తెలంగాణ ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తోందని చెప్పారు. తమను ఆర్థికంగా ఆదుకోవాలని, పిల్లలకు ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ కల్పించి.. సమన్యాయం చేయాలని కోరారు. చట్టసభల్లో అవకాశమివ్వాలని, నామినేటెడ్ పదవులు కేటాయించాలన్నారు. తమ సమస్యలపై త్వరలో సీఎం చంద్రబాబును కలసి విన్నవించనున్నట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో నారాయణమ్మ, లక్ష్మీకాంత్, రవికుమార్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఒలంపిక్ క్రీడాకారులకు 'రెడ్ చెర్రీస్' శుభాకాంక్షలు


ఒలంపిక్ సింబల్ ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన

తిరుపతి(విద్య), జూలై 23: మనదేశం తరపున ఒలంపిక్ గేమ్స్-2కే24లో ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలుపుతూ మంగళవారం రాఘవేంద్రనగర్‌లోని రెడ్‌చెర్రీస్ స్కూల్‌లో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులంతా ఒలంపిక్ సింబల్ ఆకారంలో కూర్చొని జయహో భారత్.. వందేభారత్ నినాదాలను చేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో స్కూల్ డైరెక్టర్ వి.సునీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు దేహానికి, దేశానికి ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపట్ల ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటినుంచే త్యాగరాజ సంగీత ఉత్సవాలు


మీడియాతో మోహన్ సుందరం

తిరుపతి అర్బన్, జూలై 23: కపిలతీర్థం రోడ్డులోని మండపంలో గురువారం నుంచి ఐదు రోజుల పాటు 80వ త్యాగరాజ సంగీత ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మోహన్‌సుందరం, కంచి రఘురామయ్య తెలిపారు. మంగళవారం వారు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఉత్సవాల ముగింపు రోజున ప్రముఖ వాగ్గేయకారులు హరిద్వారమంగళం డాక్టర్.ఎ.కె.పళనివేల్‌కు సప్తగిరి సంగీత విద్వాన్‌మణి బహుమతిని ప్రదానం చేస్తున్నట్లు ప్రకటించారు. ఐదు రోజుల పాటు ప్రముఖ కళాకారులతో సంగీత కచేరి ఉంటుందన్నారు.

నేడు ఇన్‌కం ట్యాక్స్ డే సంబరాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 23: ఇన్‌కం ట్యాక్స్ డే సంబరాలు బుధవారం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఎస్వీయూ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇన్‌కం ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ దీనిని చేపట్టనుంది. ఇందులో ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ దుర్గేష్ సుమ్రోత్, ఇతర అధికారులు పాల్గొంటారు.

శాంతి భద్రతలపై జగన్ స్పందన సిగ్గుచేటు : టీడీపీ


మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

తిరుపతి అర్బన్, జూలై 23: శాంతి భద్రతలపై మాజీ సీఎం జగన్ మాట్లాడడం సిగ్గుచేటని తిరుపతి పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్రనాయుడు అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఐదేళ్ల పాలనలో రోజుకొక్కరిని చంపించి ఘనత జగన్‌కే దక్కుతుందని మండిపడ్డారు. బాబాయి, డాక్టర్ సుధాకర్, ఓంప్రకాష్, చంద్రయ్యలను చంపిన నరహంతకులను నిస్సిగ్గుగా వెంటబెట్టుకొని ఢిల్లీకి వెళ్లాడని ఆరోపించారు. రాష్ట్రంలో అల్లర్లు సృష్టించి.. విదేశీ పెట్టుబడులు రాకుండా అడ్డుకునే డ్రామాలు వేస్తున్నామని ఆగ్రహించారు. 11సీట్లకే జనం పరిమితం చేసినా.. జగన్ ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. పాపాల పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి తన భూకబ్జాల చిట్టా బయటపడకుండా మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో రికార్డులను తగలబెట్టడం దారుణమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు కరాటే చంద్ర, విశ్వనాధం, రాజారాం, శంకర్, ధనంజయులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి హత్య కేసులో నిందితుడి అరెస్టు


మీడియాకు వివరాలు తెలియజేస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), జూలై 23: తిరుపతిలో సంచలనం కలిగించిన వృద్ధురాలి హత్య కేసులో నిందితుడు శ్రీనివాస్‌ను మంగళవారం స్థానిక ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు మీడియాకు వివరాలు తెలిపారు. తిరుపతి రాయల్‌నగర్‌లో బసవయ్య కుమారుడు శ్రీనివాసరావు తన భార్య రక్ష, కుమార్తెలు ప్రేరణ, నియతి, తల్లి జయలక్ష్మితో కలిసి కాపురమున్నాడు. వీరి ఇంటి ముందు మేస్త్రీ పనిచేసే శ్రీనివాస్ ఉండేవాడు. 2019లో తన తండ్రి మందలించాడని శ్రీనివాస్ అలిగి హైదరాబాదుకు వెళ్లిపోయాడు. అక్కడ హాస్టల్‌లో వెయిటర్‌గా పనిచేసేవాడు. ఈ సమయంలో శ్రీనివాస్ ఎవరో అమ్మాయిని తీసుకెళ్లి పోయాడని శ్రీనివాసరావు దంపతులు ప్రచారం చేశారని సమాచారం. అప్పటినుంచి కక్ష పెంచుకున్న శ్రీనివాస్ 2023 మార్చిలో శ్రీనివాసరావు కుటుంబాన్ని భయపెట్టాలనే ఆలోచనతో వారింటి సన్‌సైడ్ ఎదురుగా మూడు బీరు బాటిళ్లలో పెట్రోలు పోసి, ఒత్తులు పెట్టి వచ్చాడు. 20 రోజుల కిందట మళ్లీ వారింట్లో ఉన్న కెమెరాలకు దుప్పటి అడ్డుగా పెట్టగా, అది జారి కిందపడిపోయింది. జరిగిన విషయాన్ని శ్రీనివాసరావు ఇంట్లో పని మనిషి శ్రీనివాస్ తల్లికి, వీధిలో తెలిసిన వారందరికీ చెప్పింది. దీన్ని మరింత అవమానంగా భావించి.. పథకం ప్రకారం శ్రీనివాసరావు తల్లి వృద్ధురాలైన జయలక్ష్మిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈనెల 18వ తేదీన ముందస్తు ప్రణాళిక ప్రకారం సాయంత్రం 5.30 గంటల సమయంలో ఇంట్లోకి చొరబడ్డాడు. ఆ సమయంలో శ్రీనివాసరావు భార్య రక్ష, పెద్ద కుమార్తె ప్రేరణతో కలిసి డ్రైవింగ్ స్కూలుకు వెళ్లి ఉన్నారు. రెండో అంతస్తులో వృద్ధురాలు జయలక్ష్మి ఒక్కటే ఉండటంతో నిందితుడు వెళ్లి గొడవపడ్డాడు. ఆమె తలను గోడకేసి మోది హతమార్చాడు. శ్రీనివాసరావు చిన్న కుమార్తె నియతి అడ్డురాగా, ఆమె మెడపై కత్తితో పొడవడంతో ఆమె స్పృహ కోల్పోయింది. ఇంతలో డ్రైవింగ్ స్కూల్ నుంచి ఇంటికి వస్తుండిన రక్ష, ప్రేరణలను గమనించాడు. ప్రేరణ తలపై కత్తితో దాడి చేసి, వారి వద్ద స్కూటీ తాళాలు తీసుకుని పరారయ్యాడు. వాహనాన్ని రైల్వేస్టేషన్ వద్ద ఉంచి రైలులో రేణిగుంటకు చేరుకున్నాడు. అక్కడినుంచి తిరుమలకు వెళ్లిపోయాడు. దాదాపు మూడ్రోజులపాటు కొండపైనే ఉన్న నిందితుడు పోలీసుల కళ్లుగప్పి బెంగళూరుకు వెళుతుండగా చెర్లోపల్లె క్రాస్ వద్ద పట్టుకున్నారు. నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా.. 15 రోజుల రిమాండ్‌కు ఆదేశించినట్లు డీఎస్పీ రవిమనోహరాచారి చెప్పారు. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులకు ఎస్పీ రివార్డు ప్రకటించారు.

సైబర్ నేరస్తుడి అరెస్టు: రూ.12 లక్షల స్వాధీనం



నిందితుడు భానుతేజరెడ్డి
వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 23: సైబర్ నేరస్తుడిని తిరుపతి సీఐడీ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.12 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను సీఐడీ సీఐ రాంకిషోర్ మీడియాకు తెలిపారు. తిరుచానూరు పంచాయతీ కార్యదర్శిగా 2019 నుంచి విజయకుమార్ పనిచేస్తున్నాడు. అంతకుముందు తిరుపతిలోని వింగ్స్ బిజినెస్ స్కూలులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశాడు. ఈ క్రమంలో అక్కడ భానుతేజ రెడ్డి అనే విద్యార్థితో మంచి పరిచయం ఏర్పడింది. కోవిడ్ 2020 సమయంలో భానుతేజ రెడ్డి.. విజయకుమార్‌కు ఫోన్ చేసి ఆస్పత్రిలో తన తండ్రికి అత్యవసర చికిత్స నిమిత్తం రూ.4లక్షలు అప్పుగా కావాలని అడిగాడు. దీంతో రూ.4లక్షలను ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేశాడు. కొద్ది రోజుల తర్వాత భానుతేజకు విజయకుమార్ ఫోన్ చేశాడు. అయితే ఆ ఫోన్‌ను సుబ్బారెడ్డి అనే వ్యక్తి తీసి.. తాను భానుతేజకు మామయ్య అని పరిచయం చేసుకున్నాడు. రూ.4లక్షల విషయం ప్రస్తావించగా.. భానుతేజ, అతడి తల్లిదండ్రులు కోవిడ్‌తో మరణించారని తెలిపాడు. భానుతేజపై ఉన్న ఆస్తులు విక్రయించాక రూ.4లక్షలు ఇస్తానని చెప్పాడు. 2023 నవంబరులో సుబ్బారెడ్డి నుంచి విజయకుమార్‌కి ఫోన్ వచ్చింది. భానుతేజ పేరుపై ఉన్న ఆస్తులు విక్రయించేశామని, ప్రస్తుతం రూ.60లక్షలు అతడి అకౌంటులో ఉన్నాయన్నాడు. తనను భూ వివాదాల కేసులో మండ్య పోలీసులు అరెస్టు చేశారని నమ్మించాడు. రూ.4లక్షలు చట్టబద్ధంగా తీసుకోవడానికి మడకశిర సీఐ లోకేశ్ నాయక్‌ను సంప్రదించాలని ఓ నెంబరు ఇచ్చాడు.బాధితుడు ఆ నెంబరుకు ఫోన్ చేయగా.. బ్యాంకు అధికారులకు కొంత కమీషన్ ఇవ్వాల్సి ఉంటుందని, డబ్బులు ఇప్పించడంలో సాయం చేస్తానని సీఐ చెప్పాడు. ఆ తర్వాత భానుతేజకు చెందిన ఈఎంఐలు, రుణాలు ఉన్నాయని, అవి క్లియర్ అయ్యేవరకు రూ.60 లక్షలు తీసుకోలేమన్నాడు. అప్పటినుంచి విజయకుమార్‌ని సీఐగా పరిచయం చేసుకున్న వ్యక్తి మోసగించడం మొదలుపెట్టాడు. భానుతేజ, మరో ఇద్దరి బ్యాంకు ఖాతాలకు 2024 జనవరి నుంచి మే వరకు సుమారు రూ.20 లక్షలు వేయించాడు. ఇంకా నగదు కావాలని డిమాండ్ చేస్తుండటంతో అనుమానం వచ్చి ఈ ఏడాది మే 17వ తేదీన ఆన్‌లైన్ ద్వారా సైబర్ క్రైం పోలీసులకు విజయకుమార్ ఫిర్యాదు చేశాడు. సీఐడీ అదనపు డీజీపీ రవిశంకర్ ఆదేశాలతో క్యాట్ టీమ్ ఇన్‌చార్జి సీఐ రాంకిషోర్ ఫిర్యాదుదారుడిని సీఐడీ కార్యాలయానికి పిలిచి విచారించారు. దర్యాప్తులో భానుతేజరెడ్డి బతికే ఉన్నాడని.. ఇదంతా అతడే చేసినట్లు గుర్తించారు. వెంటనే నిందితుడిని అరెస్టు చేసి.. అతడి వద్ద నుంచి మొబైల్ ఫోన్, రూ.12 లక్షలను సీజ్ చేశారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ పద్మలత ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్‌ను కలిసిన కిరణ్‌రాయల్


కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న కిరణ్‌రాయల్ తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 23: కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మంగళవారం జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సుభాషిణి, సుమన్‌బాబు, కిషోర్, సాయిదేవ్, ఆది, గోపి, సుమంత్, శ్రీనివాసులు, లోకేష్ పాల్గొన్నారు.

ఢిల్లీలో ధర్నా.. జగనాడుతున్న డ్రామా: జనసేన

తిరుపతి అర్బన్: ఢిల్లీలో ధర్నా.. మాజీ సీఎం జగన్ ఆడుతున్న డ్రామా అంటూ జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ ఎద్దేవ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఐదేళ్ల పాలనలో ప్రజలను పట్టిపీడించిన జగన్.. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ ధర్నా చేపట్టడం సిగ్గుచేటన్నారు. తన హయాంలో సొంత బాబాయి హత్య విషయంతోపాటు రాష్ట్రాభివృద్ధి, ప్రత్యేకహోదా, ప్యాకేజీ, స్టీల్‌ప్లాంట్ కోసం ఢిల్లీలో ఏనాడైనా ధర్నా చేశావా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 50రోజులకే జగన్ సింపతీ కోసం డ్రామాకు తెరలేపారని విమర్శించారు. అక్రమాలు జరిగాయనే మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో విలువైన డాక్యుమెంట్‌లను దగ్ధం చేశారని ఆరోపించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులపై అనుమానం ఉందని, సీబీసీఐడీ విచారణ చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. ప్రభుత్వ కీలక కార్యాలయాల్లో వైసీపీ అధికారులు ఇంకా కొనసాగుతున్నారని, వాళ్లు లాలూచీపడి నేరాలకు పాల్పడుతున్నారని ఆగ్రహించారు. కూటమి ప్రభుత్వానికి కక్షసాధింపులు తెలియదని, రాష్ట్రం అభివృద్ధి చేయడమే తెలుసునని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ భద్రత విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా పరిగణించి ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. భద్రతా చర్యలు మరింత పెంచాలని కోరారు.

విద్యార్థినులందరికీ హాస్టల్ వసతి

మహిళా వర్సిటీ ఇన్‌చార్జి వీసీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు)జూలై23:పద్మావతి మహిళా యూనివర్సిటీలో చేరిన ప్రతి విద్యార్థినికీ హాస్టల్ వసతి కల్పిస్తామని ఇన్‌చార్జి వీసీ ఉమ స్పష్టం చేశారు. రూసా నిధులతో చేపట్టిన హాస్టల్ భవన నిర్మాణ పనుల్లో కొంత జాప్యం జరిగిందన్నారు. రాబోయే నెల రోజుల్లో నిర్మాణ పనులు పూర్తి చేసి హాస్టల్ సదుపాయం కల్పిస్తామన్నారు. పనులు త్వరగా పూర్తిచేయాలని ఇంజనీర్ శ్రీనివాస్‌ను ఆదేశించారు.

స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను సరి చేయండి

కలెక్టర్‌కు మహిళా వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఉమ విన్నపం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 23: 'ఎన్నికల సందర్భంగా పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ నిర్వహించారు. దీనికోసం గదుల నిర్మాణాల్లో మార్పు చేర్పులు చేశారు. ప్రస్తుతం టీచింగ్, రీసెర్చ్, అడ్మినిస్ట్రేషన్ అవసరాలకు అనుగుణంగా యథావిధిగా వాటిని సరిచేయండి' అని ఇన్‌చార్జి వీసీ ఉమ కోరారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి విన్నవించారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్టు సమాచారం. త్వరలోనే అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి, చేయాల్సిన పనులపై అంచనా వేసే అవకాశం ఉంది. అలాగే, ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. యూనివర్సిటీ అభివృద్ధికి అవసరమైన సహకారాన్ని అందించాలని కోరినట్లు ఆమె తెలిపారు. రిజిస్ట్రార్ రజని పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న అధికారులకు సాదర వీడ్కోలు


ధ్యానచంద్ర, అదితిసింగ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 23: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తూ విజయవాడ నగరకపాలకసంస్థ కమిషనర్‌గా వెళుతున్న ధ్యానచంద్ర, కడప జేసీగా బదిలీపై వెళుతున్న తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్‌కు కలెక్టరేట్‌లో మంగళవారం సాదర వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికల నిర్వహణ సమయంలో ధ్యానచంద్ర, అదితిసింగ్ సమర్థవంతంగా పనిచేశారని ప్రశంసించారు. ధ్యానచంద్ర మాట్లాడుతూ.. జిల్లాలో పనిచేయడం ఒక సవాల్‌తో కూడుకున్నదని.. ఇక్కడ ఎంతో నేర్చుకోవచ్చని, పైగా శ్రీవారి చెంత పనిచేయం అదృష్టమన్నారు. ఐఏఎస్ అధికారిగా తిరుపతిలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వర్తించడం చక్కటి అవకాశంగా భావిస్తున్నానని అదితిసింగ్ తెలిపారు. బదిలీపై వెళుతున్న వారిద్దరినీ పలువురు అధికారులు అభినందించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెంచలకిషోర్, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'విశ్వామిత్ర' పద్యనాటకం


కళాకారులతో నిర్వాహకులు - బ్రహ్మర్షి విశ్వామిత్ర పద్యనాటకం

తిరుపతి (కల్చరల్), జూలై 23: తిరుపతికి చెందిన అభినయ ఆర్ట్స్ వారి వార్షికోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ (కొత్త ఢిల్లీ), ఆంధ్ర రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక శాఖ (అమరావతి), టీటీడీ సంయుక్త నిర్వహణలో హనుమ అవార్డ్స్ పోటీలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఖమ్మం కల్చరల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో మహతి వేదికపై ప్రదర్శించిన పద్యనాటకం బ్రహ్మర్షి విశ్వామిత్ర ప్రేక్షకులను ఆకట్టుకుంది. అంతకుముందు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నృత్యపోటీలు నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు నటరాజ డ్రమటిక్ అసోసియేషన్, పెందుర్తి, విశాఖ జిల్లా కళాకారులు 'శిథిలజీవి' సాంఘిక నాటిక, రాత్రి 7.45 గంటలకు గుంటూరుకు చెందిన ఆరాధన ఆర్ట్స్ అకాడమీ వారి 'క్షేత్రం'సాంఘిక నాటికను ప్రదర్శించారు.

నేటి కార్యక్రమాలిలా..

బుధవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు వివిధ విభాగాల్లో నృత్యపోటీలుజరుగుతాయి. మధ్యాహ్నం 3.30 గంటలకు కళాసాగర్ నాటక సంక్షేమ సేవా సంఘం, రాజాం, విజయనగరం జిల్లా వారిచే శ్రీకాళహస్తీశ్వర మహత్యం (భక్తకవి నక్కీరుని కథ) పద్యనాటకం ఉంటుంది. సాయంత్రం 6.30 గంటలకు శ్రీకృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్ గుడివాడ వారి మళ్లీ కలిసి జీవిద్దాం అనే సాంఘిక నాటిక, రాత్రి 7.45 గంటలకు తెలుగు కళాసమితి విశాఖ వారి నిశ్శబ్దమా నీ ఖరీదెంత అనే సాంఘిక నాటిక ప్రదర్శిస్తారు.


చిన్నారుల నృత్య ప్రదర్శన - శిథిలజీవి, క్షేత్రం సాంఘిక నాటికల్లో సన్నివేశాలు

'కారుణ్యం' చూపని గౌతమ్‌తేజ్!

- చిత్తూరులో పనిచేసినప్పుడు కారుణ్య నియామకాలకు భారీగా వసూళ్లు
- ఇప్పుడు మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో రికార్డులు కాలిన ఘటనలో నిందితుడు



చిత్తూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టరు కార్యాలయంలో 22(ఏ) సెక్షన్‌లో రికార్డులను ఉద్దేశపూర్వకంగా కాల్చారని ఉన్నతాధికారులు నిర్ధారించిన ఘటనలో నిందితుడైన గౌతమ్‌తేజ్ కెరీరంతా అవినీతిమయమే. ఆ సెక్షన్ క్లర్కు (సీనియర్ అసిస్టెంట్) అయిన ఇతడు 'కారుణ్య' నియామకం ద్వారా చిత్తూరు కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా చేరారు. కారుణ్య నియామక విభాగానికి ఇన్‌ఛార్జిగా పనిచేశారు. ఇతడి కెరీర్ అవినీతిమయమేనని రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది. డబ్బులిస్తే ఏ పనైనా చేస్తాడని అంటున్నారు. కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగంలో చేరిన ఇతడు ఏమాత్రం 'కారుణ్యం' చూపేవాడు కాదంటూ ఐదేళ్ల కిందటి ఘటనను ఇప్పుడు గుర్తుచేసుకుంటున్నారు. కారుణ్య నియామక విభాగానికి ఇన్‌ఛార్జిగా పనిచేసేటప్పుడు 2019 జూలైలో సుమారు 25 మంది అభ్యర్థుల వద్ద రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేశారు. అంటే, ఉద్యోగి అయిన తండ్రి చనిపోయి బాధలో ఉన్న ఆ కుటుంబం నుంచి నిర్దాక్షిణ్యంగా డబ్బు వసూలు చేశాక ఫైల్‌ను ప్రాసెస్ చేసేవారన్న ఆరోపణలున్నాయి. దీనిపై 2019 జూలైలో 'ఆంధ్రజ్యోతి'లో కథనం కూడా ప్రచురితమైంది. ఇప్పుడు మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో దుండగులు రికార్డులు కాల్చిన 22(ఏ) సెక్షన్‌కు సంబంధించి గౌతమ్‌తేజ్ ఇప్పుడు క్లర్కుగా పనిచేస్తున్నారు. ఇతడి గత వ్యవహార శైలిని పరిశీలించిన రెవెన్యూ వర్గాలు అనేక అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. కాగా, ఈ ఘటనలో పలువురు సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బందిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వీరిలో గౌతమ్‌తేజ్ కూడా ఉన్నారు. పోలీసుల విచారణలో అతడు ఏదీ ఒప్పుకోలేదని తెలుస్తోంది.

మదనపల్లెలో చిత్తూరు, తిరుపతి కలెక్టర్లు

చిత్తూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో దుండగులు రికార్డులు కాల్చిన ఘటనపై మంగళవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా అక్కడికి మదనపల్లెకు వెళ్లి ఈ ఘటనపై లోతుగా విచారించారు. ఈ క్రమంలోనే చిత్తూరు, తిరుపతి కలెక్టర్లు సుమిత్‌కుమార్, వెంకటేశ్వర్లు కూడా మంగళవారం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి హాజరయ్యారు. సిసోడియాతో మాట్లాడారు. ఈ ఘటనపై ఇద్దరు కలెక్టర్లకు కీలక విచారణ బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఇద్దరు కలెక్టర్లు మంగళవారం నుంచే తమకు అప్పగించిన బాధ్యతల్ని అమలు చేయడం ప్రారంభించినట్లు సమాచారం. కాగా, జిల్లాల విభజనకు ముందు పుంగనూరు, కుప్పం, పలమనేరు నియోజకవర్గాలు మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండేవి. దీంతో పుంగనూరు నియోజకవర్గ రికార్డులు ఇంకా మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఉండే అవకాశాలున్నాయని సమాచారం. గత ఐదేళ్లలో పెద్దిరెడ్డి కుటుంబం అనేక ప్రాంతాల్లో భూఆక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. అదే సమయంలో మంగళవారం పెద్దిరెడ్డి ప్రధాన అనుచరుడు మాధవరెడ్డి ఇంట్లో అధికారుల సోదాల్లో రెండు సంచుల రికార్డులు బయటపడ్డాయి. దీంతో కాలిపోయిన రికార్డులకు, జిల్లాకూ లింకు ఉందా అనే దిశగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మదనపల్లె మాజీ ఆర్డీవో విచారణ

తిరుపతి(నేరవిభాగం), జూలై 23: మదనపల్లె ఆర్డీవోగా పనిచేసి ప్రస్తుతం తిరుపతి కలెక్టరేట్‌లో రెవెన్యూ లీగల్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న మురళిని పోలీసులు సోమవారం మదనపల్లెకు విచారణ నిమిత్తం రప్పించారు.మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాల యంలో ఆదివారం రాత్రి జరిగిన ప్రమాద ఘటనలో కీలక రికార్డులు అగ్నికి ఆహుతైన కేసుకు సంబంధించి డీఎస్పీ ప్రసాద రెడ్డి, ప్రత్యేక బృందాలు మంగళవారం విచారణ చేపట్టాయి. బుధవారం మళ్లీ విచారణ నిమిత్తం మురళిని మదనపల్లెలోనే అందుబాటులో వుండాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయనతో పాటు తిరుపతికి చెందిన మరో నలుగురు అధికారులను మదనపల్లె పోలీసులు అక్కడకు రప్పించి విచారణ చేస్తున్నారు.

గూడూరును నెల్లూరు జిల్లాలో కలపండి

మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్యే పాశిం విన్నపం



లోకేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే పాశిం

గూడూరు, జూలై 23: గూడూరు నియోజక వర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ కోరారు. మంగళవారం అమరా వతి లోని సచివాలయ కార్యాలయంలో మంత్రి లోకేశ్‌ను మర్యాద పూ ర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గూడూరు నియోజకవర్గం తిరుపతి జిల్లాలో ఉండడంతో జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఇటు ప్రజలు, అటు అధికారులు ఇబ్బందులు పడుతున్నా ర న్నారు. గూడూరు నుంచి తిరుపతికి 100 కిలోమీటర్లుకు పైగా ఉండడంతో పనులపై జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే వ్యయ ప్రయాసలు పడాల్సి వస్తోం దన్నారు. నెల్లూరైతే 35 కిలోమీటర్లు ఉండడంతో ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. యువగళం పాదయాత్ర సమయంలో నియోజకవర్గంలో పర్యటించే సమయంలో గూడూరును నెల్లూరులో కలుపుతామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే మంత్రి లోకేశ్‌కు గుర్తుచేశారు. దీంతో మంత్రి సాను కూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే నెల్లూరు జిల్లాలో కలిపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. అదేవిధంగా పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌ను కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని విన్నవించినట్లు తెలిపారు. రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్‌ను కలిసి చెన్నై- బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణంలో చిల్లకూరు, కోట మండలాలకు చెందిన రైతుల భూసేకరణకు సంబంధించి పరిహారాన్ని త్వరితగతిన అందించాలని విన్నవించానన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే విజయశ్రీ



మంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ మంత్రి పరసా, మాజీ ఎమ్మెల్యే నెలవల

సూళ్లూరుపేట/ నాయుడుపేట, జూలై 23: విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను మంగళవారం అమరావతిలో ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ మంత్రి పరసా వెంకటరత్నం, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం మర్యాద పూర్వకంగా కలిశారు. అసెంబ్లీ విరామ సమయంలో లోకేశ్ ఛాంబర్‌లో కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. అదే విధంగా సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్యను కూడా మంత్రికి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌లో, పెళ్లకూరు మండలంలోని శిరసనంబేడులో పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాడాలని మంత్రిని కోరారు. నియోజకవర్గంలో కేంద్రీయ విద్యాలయం, పెళ్లకూరు మండలంలో గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలసి మాట్లాడినట్లు తెలిపారు. మంత్రి కూడా సానుకూలంగా స్పందించారని ఆమె పేర్కొన్నారు.

మంత్రి ఆనంను కలిసిన టీడీపీ నేతలు



పెళ్లకూరు, జూలై 23: ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో పాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, బంగారంపేట సర్పంచు డి.నాగేంద్రప్రసాద్‌రెడ్డి, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి వి.శేఖర్‌నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం అమరావతి అసెంబ్లీ హాల్‌లో కలసి మండల అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఆర్‌అండ్‌బీ బంగ్లా

సూళ్లూరుపేట, జూలై 23: ప్రభుత్వ ఆస్తులకు రక్షణ లేదు.. వాటిపై సంబధిత అధికారులకు అజమాయిషీ సైతం లేకపోవడంతో ఆ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయి. ఆ భూములను గుట్టుచప్పుడు కాకుండా కొట్టేసే ప్రయత్నాలు జరిగింది. అయినా అధికారుల తీరులో మార్పు రాలేదు. సూళ్లూరుపేట నడిబొడ్డున సుమారు ఎకరా స్థలంలో ఆర్‌అండ్‌బీ బంగ్లా ఉంది. ఈ బంగ్లాలో అన్ని వసతులతో కూడిన రెండు సూట్లు ఉన్నాయి. ఉన్నతాధికారులు, వీఐపీలు వచ్చినప్పుడు ఈ బంగ్లాలోనే బస చేస్తారు. ఎన్నికలకు ముందు ఈ బంగ్లాను రూ.20 ఆధునికీకరించారు. అయితే వినియోగంలోకి తేలేదు. చుట్టూ పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా ఉండడమే కాకుండా మందుబాబులు, అసాంఘిక కార్యక్రమాలను నిలయంగా మారింది. బంగ్లా ఆవరణలో ఎక్కడ చూసినా మందు బాటిళ్లు, గ్లాసులు పడి ఉన్నాయి. ఈ బంగ్లాకు కూతవేటు దూరంలో అర్‌అండ్‌బీ అధికారుల కార్యాలయం ఉన్నా పట్టించుకోవవడం లేదు.



నిరుపయోగంగా ఉన్న సూళ్లూరుపేట ఆర్‌అండ్‌బీ బంగ్లా

తడలో వింత పరిస్థితి....

అదే విధంగా తడలో కూడా ఆర్‌అండ్‌బీ శాఖకు విలువైన భూమి ఉంది. మండలంలోని తడ కండ్రిగ సర్వే నెం.110లో 3.50 ఎకరాలున్నాయి. 1996కు ముందు అక్కడ ఒక అతిథి గృహం ఉండేది. అది శిథిలావస్థకు చేరుకోవడంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి పరసా వెంకటరత్నం నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయించారు. అయితే 50 శాతం పనులు పూర్తయినా ఇతర కారణాలతో ఆగిపోయింది. 2020లో ఈ భూముల్లో కొంతభాగం అన్యాక్రాంతమైంది. దీంతో అప్పటి ఉమ్మడి నెల్లూరు జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన విచారణ జరిపి స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.100 కోట్ల విలువైన భూమి అది. దాన్ని సంరక్షించుకోవాలన్న ఆలోచన అధికారులకు లేదు. ఇకనైనా ఉన్నతాధికారులు ఈ బంగ్లాలాలపై శ్రద్ధ వహించి వాటిని వినియోగంలోకి తీసుకురావాల్సి ఉంది.



మొండి గోడలతో నిలిచిపోయిన తడ ఆర్‌అండ్‌బీ భవనం

పురాతన శివాలయాన్ని చదును చేసేశారు!





చదును చేసిన పురాతన చిన్న శివాలయం - గ్రామస్తులు భద్రపరచిన శివలింగం, నాగలక్ష్మి

నాయుడుపేట, జూలై 23: దాదాపు 500 సంవత్సరాల నాటి పురాతనమైన శివాలయం పక్కన ఉన్న చిన్న శివాలయాన్ని గుర్తు తెలి యని వ్యక్తులు చదును చేసేశారు. ఆ ఆలయంలోని విగ్రహాలను పక్కన పడేయడంతో వాటిని గ్రామస్తులు మంగళవారం గుర్తించారు. నాయుడుపేట మండలం పుదూరులోని పొలాల సమీపంలో అతి పురాతనమైన శివాలయం ఉంది. గతంలో గుప్త నిధుల కోసం అగంతకులు ఆ ఆలయం వద్ద తవ్వకాలు కూడా చేపట్టారు. అలాగే ఈ ఆలయానికి సమీపంలో చిన్న శివాలయం, నాగలక్ష్మిపుట్ట ఉన్నాయి. అక్కడ తవ్వ కాలు చేపట్టాలనుకున్నారో ఏమో ఆ చిన్నగుడిని పూర్తిగా తొలగించేశారు. ఈ సంఘటనపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

15నాటికి అన్న క్యాంటీన్లు ప్రారంభం కావాలి

మున్సిపల్ కమిషనర్లకు కలెక్టర్ ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), జూలై 23: అన్న క్యాంటీన్లను జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల పరిధిలో వచ్చే నెల 15వ తేదీనాటికి తప్పకుండా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. జిల్లాలో 11 అన్న క్యాంటీన్లు ప్రారంభించాలని, అందుకు తగిన చర్యలు ఇప్పటి నుంచే చేపట్టాలని సూచించారు. తిరుపతి, శ్రీకాళహస్తి, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరిలో అన్న క్యాంటీన్ల కోసం గుర్తించిన భవనాల మరమ్మతులు త్వరగా పూర్తిచేయాలని చెప్పారు. పుత్తూరులో క్యాంటీన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కొత్త నిర్మాణం చేపట్టడానికి టెండర్లు పిలిచామని, సమయం పడుతుందని కమిషనర్ తెలిపారు. మరమ్మతులు, భవన నిర్మాణాల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షించి.. సకాలంలో పనులు పూర్తయ్యేలా చూడాలని కమిషనర్లకు కలెక్టర్ ఆదేశాలిచ్చారు. డీఆర్వో పెంచలకిషోర్, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సెక్షన్ డీటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి హత్య కేసులో నిందితుడి అరెస్టు



మీడియాకు వివరాలు తెలియజేస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), జూలై 23: తిరుపతిలో సంచలనం కలిగించిన వృద్ధురాలి హత్య కేసులో నిందితుడు శ్రీనివాస్‌ను మంగళవారం స్థానిక ఎస్వీయూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు మీడియాకు వివరాలు తెలిపారు. తిరుపతి రాయల్‌నగర్‌లో బసవయ్య కుమారుడు శ్రీనివాసరావు తన భార్య రక్ష, కుమార్తెలు ప్రేరణ, నియతి, తల్లి జయలక్ష్మితో కలిసి కాపురమున్నాడు. వీరి ఇంటి ముందు మేస్త్రీ పని చేసే శ్రీనివాస్ ఉండేవాడు. 2019లో తన తండ్రి మందలించాడని శ్రీనివాస్ అలిగి హైదరాబాదుకు వెళ్లిపోయాడు. అక్కడ హాస్టల్‌లో వెయిటర్‌గా పనిచేసేవాడు. ఈ సమయంలో శ్రీనివాస్ ఎవరో అమ్మాయిని తీసుకెళ్లి పోయాడని శ్రీనివాసరావు దంపతులు ప్రచారం చేశారని సమాచారం. అప్పటినుంచి కక్ష పెంచుకున్న శ్రీనివాస్ 2023 మార్చిలో శ్రీనివాసరావు కుటుంబాన్ని భయపెట్టాలనే ఆలోచనతో వారింటి సన్‌సైడ్ ఎదురుగా మూడు బీరు బాటిళ్లలో పెట్రోలు పోసి, ఒత్తులు పెట్టి వచ్చాడు. 20 రోజుల కిందట మళ్లీ వారింట్లో ఉన్న కెమెరాలకు దుప్పటి అడ్డుగా పెట్టగా, అది జారి కిందపడిపోయింది. జరిగిన విషయాన్ని శ్రీనివాసరావు ఇంట్లో పని మనిషి శ్రీనివాస్ తల్లికి, వీధిలో తెలిసిన వారందరికీ చెప్పింది. దీన్ని మరింత అవమానంగా భావించి.. పథకం ప్రకారం శ్రీనివాసరావు తల్లి వృద్ధురాలైన జయలక్ష్మిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈనెల 18వ తేదీన ముందస్తు ప్రణాళిక ప్రకారం సాయంత్రం 5.30 గంటల సమయంలో ఇంట్లోకి చొరబడ్డాడు. ఆ సమయంలో శ్రీనివాసరావు భార్య రక్ష, పెద్ద కుమార్తె ప్రేరణతో కలిసి డ్రైవింగ్ స్కూలుకు వెళ్లి ఉన్నారు. రెండో అంతస్తులో వృద్ధురాలు జయలక్ష్మి ఒక్కటే ఉండటంతో నిందితుడు వెళ్లి గొడవపడ్డాడు. ఆమె తలను గోడకేసి మోది హతమార్చాడు. శ్రీనివాసరావు చిన్న కుమార్తె నియతి అడ్డురాగా, ఆమె మెడపై కత్తితో పొడవడంతో ఆమె స్పృహ కోల్పోయింది. ఇంతలో డ్రైవింగ్ స్కూల్ నుంచి ఇంటికి వస్తుండిన రక్ష, ప్రేరణలను గమనించాడు. ప్రేరణ తలపై కత్తితో దాడి చేసి, వారి వద్ద స్కూటీ తాళాలు తీసుకుని పరారయ్యాడు. వాహనాన్ని రైల్వేస్టేషన్ వద్ద ఉంచి రైలులో రేణిగుంటకు చేరుకున్నాడు. అక్కడినుంచి తిరుమలకు వెళ్లిపోయాడు. దాదాపు మూడ్రోజులపాటు కొండపైనే ఉన్న నిందితుడు పోలీసుల కళ్లుగప్పి బెంగళూరుకు వెళుతుండగా చెర్లోపల్లె క్రాస్ వద్ద పట్టుకున్నారు. నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా.. 15 రోజుల రిమాండ్‌కు ఆదేశించినట్లు డీఎస్పీ రవిమనోహరాచారి చెప్పారు. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులకు ఎస్పీ రివార్డు ప్రకటించారు.

సైబర్ నేరస్తుడి అరెస్టు: రూ.12 లక్షల స్వాధీనం



నిందితుడు భానుతేజరెడ్డి వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 23: సైబర్ నేరస్తుడిని తిరుపతి సీఐడీ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.12 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను సీఐడీ సీఐ రాంకిషోర్ మీడియాకు తెలిపారు. తిరుచానూరు పంచాయతీ కార్యదర్శిగా 2019 నుంచి విజయకుమార్ పనిచేస్తున్నాడు. అంతకుముందు తిరుపతిలోని వింగ్స్ బిజినెస్ స్కూలులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశాడు. ఈ క్రమంలో అక్కడ భానుతేజ రెడ్డి అనే విద్యార్థితో మంచి పరిచయం ఏర్పడింది. కోవిడ్ 2020 సమయంలో భానుతేజ రెడ్డి.. విజయకుమార్‌కు ఫోన్ చేసి ఆస్పత్రిలో తన తండ్రికి అత్యవసర చికిత్స నిమిత్తం రూ.4లక్షలు అప్పుగా కావాలని అడిగాడు. దీంతో రూ.4లక్షలను ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేశాడు. కొద్ది రోజుల తర్వాత భానుతేజకు విజయకుమార్ ఫోన్ చేశాడు. అయితే ఆ ఫోన్‌ను సుబ్బారెడ్డి అనే వ్యక్తి తీసి.. తాను భానుతేజకు మామయ్య అని పరిచయం చేసుకున్నాడు. రూ.4లక్షల విషయం ప్రస్తావించగా, భానుతేజ, అతడి తల్లిదండ్రులు కోవిడ్‌తో మరణించారని తెలిపాడు. భానుతేజపై ఉన్న ఆస్తులు విక్రయించాక రూ.4లక్షలు ఇస్తానని చెప్పాడు. 2023 నవంబరులో సుబ్బారెడ్డి నుంచి విజయకుమార్‌కి ఫోన్ వచ్చింది. భానుతేజ పేరుపై ఉన్న ఆస్తులు విక్రయించేశామని, ప్రస్తుతం రూ.60లక్షలు అతడి అకౌంటులో ఉన్నాయన్నాడు. తనను భూ వివాదాల కేసులో మండ్య పోలీసులు అరెస్టు చేశారని నమ్మించాడు. రూ.4లక్షలు చట్టబద్ధంగా తీసుకోవడానికి మడకశిర సీఐ లోకేశ్ నాయక్‌ను సంప్రదించాలని ఓ నెంబరు ఇచ్చాడు.బాధితుడు ఆ నెంబరుకు ఫోన్ చేయగా.. బ్యాంకు అధికారులకు కొంత కమీషన్ ఇవ్వాల్సి ఉంటుందని, డబ్బులు ఇప్పించడంలో సాయం చేస్తానని సీఐ చెప్పాడు. ఆ తర్వాత భానుతేజకు చెందిన ఈఎంఐలు, రుణాలు ఉన్నాయని, అవి క్లియర్ అయ్యేవరకు రూ.60 లక్షలు తీసుకోలేమన్నాడు. అప్పటినుంచి విజయకుమార్‌ని సీఐగా పరిచయం చేసుకున్న వ్యక్తి మోసగించడం మొదలుపెట్టాడు. భానుతేజ, మరో ఇద్దరి బ్యాంకు ఖాతాలకు జనవరి 2024 నుంచి మే వరకు సుమారు రూ.20 లక్షలు వేయించాడు. ఇంకా నగదు కావాలని డిమాండ్ చేస్తుండటంతో అనుమానం వచ్చి ఈ ఏడాది మే 17వ తేదీన ఆన్‌లైన్ ద్వారా సైబర్ క్రైం పోలీసులకు విజయకుమార్ ఫిర్యాదు చేశాడు. సీఐడీ అదనపు డీజీపీ రవిశంకర్ ఆదేశాలతో క్యాట్ టీమ్ ఇన్‌చార్జి సీఐ రాంకిషోర్ ఫిర్యాదుదారుడిని సీఐడీ కార్యాలయానికి పిలిచి విచారించారు. దర్యాప్తులో భానుతేజరెడ్డి బతికే ఉన్నాడని.. ఇదంతా అతడే చేసినట్లు గుర్తించారు. వెంటనే నిందితుడిని అరెస్టు చేసి.. అతడి వద్ద నుంచి మొబైల్ ఫోన్, రూ.12 లక్షలను సీజ్ చేశారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ పద్మలత ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అనుమానాస్పద స్థితిలో ఆటోడ్రైవర్ మృతి

పోలీసుల అదుపులో మృతుడి భార్య





మృతుడు నరేష్ - మృతుడి భార్య ధనలక్ష్మిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

తిరుచానూరు, జూలై 23: అనుమానాస్పద స్థితిలో ఆటోడ్రైవర్ మృతి చెందిన సంఘటన తిరుపతి రూరల్ మండలం పాడిపేట శివపురం కాలనీలో చోటు చేసుకుంది. మృతుడి సోదరుడు ఈశ్వరయ్య కథనం మేరకు వివరాలు... ఏర్పేడు మండలం ముసలిపేడు హరిజనవాడకు చెందిన నరేష్(35)కు తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకానికి చెందిన ధనలక్ష్మితో పదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. నరేష్ ముసలిపేడులో నివాసం ఉంటూ తిరుచానూరుకు వచ్చి ఆటో నడుపుకుని తిరిగి రాత్రికి ఇంటికి వెళ్లేవాడు. ముసలిపేడు హరిజనవాడకు చెందిన ఓ యువకుడితో అతడి భార్య వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. దీంతో తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో నరేష్ తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాడిపేట శివపురం కాలనీలో రెండు వారాల క్రితం ఇంటిని అద్దెకు తీసుకుని భార్య, బిడ్డలతో మకాం మార్చాడు. తిరుచానూరులోనే ఆటో తోలుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం వేకువజామున అద్దెకు ఉన్న ఇంటి వరండాలో నరేష్ తాడుకు వేలాడుతూ విగతజీవుడై కనిపించాడు. గుర్తించిన చుట్టుపక్కల వాళ్లు పోలీసులకు, మృతుడి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. పోలీసులు వెళ్లేటప్పటికే మృతుడి భార్య ధనలక్ష్మి, మరి కొందరు కలిసి రేకుల పైకప్పుకు చీరతో వేలాడుతున్న మృతదేహాన్ని కిందకు దించి పడుకోబెట్టారు. విషయం తెలుసుకున్న తిరుచానూరు సీఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతుడి కుటుంబీకులు, స్థానికులు నరేష్ భార్య ధనలక్ష్మిపై అనుమానం వ్యక్తం చేయడంతో ఆమెను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తన తమ్ముడి మరణం విషయంలో మరదలు ధనలక్ష్మి, తమ గ్రామానికి చెందిన హరిపై అనుమానం ఉందని ఈశ్వరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. నరేష్ మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రుయా మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కటుంబీకులకు అప్పగించారు. ఇదిలా ఉండగా తమ ఇంటికి రాత్రి హరి బాబాయ్ వచ్చాడని.. అమ్మ, అతడు కలిసి నాన్న ముఖంపై దిండుతో అదిమారని.. తరువాత చీరతో వేలాడదీశారని పోలీసులకు నరేష్ కుమార్తె ఏడేళ్ల చిన్నారి చెప్పినట్లు తెలిసింది. తన భార్యకు వేరే యువకుడితో వివాహేతర సంబంధం ఉండటంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడా? లేకా భార్య, ఆమె ప్రియుడి చేతిలో హత్యకు గురయ్యాడా? అన్న విషయం పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఈ సంఘటన పాడిపేటలో తీవ్ర సంచలనం రేకెత్తించింది.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



నాయుడుపేట టౌన్, జూలై 23: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. నాయుడుపేట మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం సమీపంలో మంగళవారం తెల్లవారుజామున ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న 5 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్లతోపాటు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహితపై కత్తితో దాడి

మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలింపు



దాడిలో తీవ్రంగా గాయపడిన లక్ష్మి

నాయుడుపేట టౌన్, జూలై 23: రెండేళ్లుగా వారి మధ్య వివాహేతర సంబంధం నడుస్తోంది. ఇంతలో ఏమైందో తెలియదు ఆమె అతడితో దూరం జరిగింది. ఇది తట్టుకోలేక మద్యం మత్తులో ఆ మహిళపై విచక్షణా రహితంగా కత్తితో దాడి చేశాడు సదరు వ్యక్తి. ఈ ఘటన మంగళవారం తెల్లవారు ఝామున జరిగింది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని పూడేరు గ్రామానికి చెందిన లక్ష్మి మరో కొంతమంది మహిళలు ప్రతి రోజు తెల్లవారు జామున చెన్నైకు వెళ్లి బియ్యం తీసుకువచ్చి నాయుడుపేట పరిసర ప్రాంతాల్లో విక్రయించి జీవనం సాగిస్తుంటారు. విక్రయించే సమయంలో శ్రీకాళహస్తికి చెందిన నాగార్జున్‌తో పరిచయం ఏర్పడింది. అది వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈక్రమంలో ఎప్పటిలాగే లక్ష్మి మరో మహిళతో కలసి చెన్నైకు వెళ్లేందుకు మంగళవారం తెల్లవారుజామున నాయుడుపేట - మల్లాం జంక్షన్ జాతీయ రహదారి కూడలి వద్ద ఓ దుకాణం వద్ద కూర్చొని ఉంది. అదే సమయంలో నాగార్జున్ అక్కడికి చేరుకున్నాడు. లక్ష్మి సహా అక్కడే ఉన్న మహిళతో వాగ్వాదానికి దిగాడు. అక్కడే దుకాణాల వద్ద నిద్రిస్తున్న వారు నచ్చచెప్పి అక్కడి నుంచి పంపేశారు. కొంత సమయం తరువాత మద్యం తాగి వచ్చిన నాగార్జున్ మళ్లీ మహిళల దగ్గరకు చేరుకొని తన చేతిలో ఉన్న కత్తితో లక్ష్మిపై విచక్షణా రహితంగా దాడి చేసి పరారయ్యాడు. చుట్టుపక్కల వాళ్లు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు లక్ష్మిని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. ఈ మేరకు కేసుయి నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొన్న కారు

ఒకరి మృతి, నలుగురికి గాయాలు

ఓజిలి జులై 23: మండలంలోని పెద్దపరియ క్రాస్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన ఒకరు మృతి చెందగా మరో నలుగురు గాయపడ్డారు. చెన్నై నుంచి నెల్లూరుకు వెళ్తున్న లారీ పెద్దపరియ క్రాస్ రోడ్డు వద్ద ఉన్నట్టుండి బ్రేక్ వేయడంతో అదే మార్గంలో ఒంగోలుకు వెళ్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. చీమకుర్తికి చెందిన శీను(40)తో పాటు మరో నలుగురు తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై అరుణాచలం దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో పెద్దపరియ క్రాస్ రోడ్డు వద్ద ముందు వెళ్తున్న లారీని ఢీకొన్నారు. ఈ ఘటనలో ముందు సీట్లో ఉన్న శీను తీవ్రంగా గాయపడగా, డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన శీను చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మరణించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవిబాబు తెలిపారు.

తమిళ రేషన్ బియ్యం స్వాధీనం

తడ, జూలై 23: అక్రమంగా తరలిస్తున్న 10 టన్నుల తమిళ రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చెన్నై నగరం తాంబరం నుంచి తమిళ రేషన్ బియ్యంతో రెండు మినీ ట్రక్కులు తడ బయలుదేరాయి. పోలీసులకు సమాచారం అందడంతో బోడిలింగాలపాడు మలుపు వద్ద సోమవారం రాత్రి తనిఖీలు చేశారు. అదే సమయంలో సమీపంలోని పెట్రోలు బంకు వద్ద రెండు మినీ ట్రక్కులు నిలిపి ఉండడంతో వాటిని తనిఖీ చేశారు. అందులో బియ్యం ఉండటాన్ని గుర్తించారు. వెంటనే ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకొని ఆ వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రెండు వాహనాల్లో 201 బస్తాల్లో 10 టన్నుల బియ్యాన్ని సివిల్ సప్లయ్ డీటీ ఓబయ్యకు అప్పగించారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.3.50 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఇద్దరూ డ్రైవర్లతో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ నరసింహారావు తెలిపారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరం



కొండాపురం పాఠశాలలో పోస్టర్ల ద్వారా అవగాహన

వాకాడు/ కోట/ గూడూరు అర్బన్, జూలై 23: బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరమని వాకాడు ఐసీడీఎస్ సూపర్ వైజర్ బుజ్జమ్మ అన్నారు. వాకాడు మండలంలోని కొండాపురం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు బాల్య వివాహాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుతోపాటు పరిశుభ్రత, పౌష్టిక ఆహారంపైకూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని కోట సీడీపీవో మునికుమారి చెప్పారు. గూడలి ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ జరిగింది. అనంతరం బాల్యవివాహాల వలన కలిగే నష్టాలను వివరించే వాల్ పోస్టర్లను సీడీపీవోతోపాటు హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, సూపర్ వైజర్ కవిత ఆవిష్కరించారు. గూడూరు పట్టణంలోని బాలాజీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బాల్యవివాహాల వలన జరిగే అనర్థాలపై సీడీపీవో మెహబూబీ మంగళవారం మహిళలకు అవగాహన కల్పించారు. ఎవరైనా బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

తాగునీటి సమస్య పరిష్కరించండి



నిరసన తెలుపుతున్న గోవర్ధనపురం మహిళలు

వరదయ్యపాళెం, జూలై 23: వరదయ్యపాళెం మండలంలో ఇందిరానగర్ పంచాయతీ గోవర్ధనపురం వాసులు నీటి సరఫరా లేక 15రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక సర్పంచు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. మంగళవారం ఉదయం గ్రామస్థులు శ్రీకాళహస్తి - తడ రహదారిపై ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. దీంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళన కారులకు సర్దిచెప్పారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఏఎస్ఐ షణ్ముగం హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. తాత్కాలికంగా లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యాంకు ద్వారా నీటి సరఫరా చేశారు. కాగా, పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి సమస్యను పరిష్క రించేందుకు చర్యలు చేపట్టామని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి నిర్మల్‌కుమార్ చెప్పారు.

ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ

శ్రీకాళహస్తి, జూలై 23: ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ చేయనున్నట్లు శ్రీకాళహస్తీశ్వరా లయ ఈవో ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి తెలిపారు. ఆలయంలోని శ్రీవళ్లీ దేవసేన సమేత చెంగల్వరాయ సన్నిధి వద్ద రాత్రి 7.30గంటలకు అంకురార్పణ జరుగుతుందన్నారు.

పాఠశాలల్లో ఉత్సాహంగా శిక్షా సప్తాహ్



శిరుణంబూదూరు పాఠశాలలో సంఖ్యాశాస్త్రంపై అవగాహన

సత్యవేడు, జూలై 23: జాతీయ విద్యావిధానం నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాల సందడి నెలకొంది. జాతీయ విద్యా విధానం ప్రవేశ పెట్టిన తరువాత విద్యాభివృద్ధిలో చోటు చేసుకున్న సంస్కరణలు, నిబద్ధతను తెలియజేసేందుకే కేంద్ర ప్రభుత్వం శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టింది. ఈ నెల 22నుంచి 28వ తేదీ వరకు ఏడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేలా కార్యచరణ రూపొందించారు. ఈమేరకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం నుంచి ప్రత్యేక కార్యక్రమాలను ప్రారంభించారు. తొలిరోజైన సోమవారం ఉపాధ్యాయులు స్థానిక వనరులతో బోధన సామగ్రిని ప్రదర్శించారు. రెండవ రోజు మంగళవారం సామాజిక భాగస్వామ్యంతో పునాది విద్య, సాంఖ్యక శాస్త్రం, నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా 24న క్రీడలు, శారీరక సౌష్టవం ప్రాముఖ్యతను తెలియజేసేలా క్రీడా పోటీలు నిర్వహించడం, 25న విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని పెంపొందించడానికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం, 26న నైపుణ్య విద్య, సమర్థమైన పోటీతత్వంను అలవర్చుకునేందుకు విద్యలో సాంకేతిక దివస్ నిర్వహించడం, 27న అమ్మపేరుతో మొక్కలు నాటడం, 28న విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేయడం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఎంఈవో తెలిపారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, జూలై 23: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం దాతలు భక్తులకు అన్నదానం చేశారు.

వేడుకగా కాలభైరవస్వామి ప్రాకారోత్సవం

శ్రీకాళహస్తి, జూలై 23: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన కాలభైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. ఆలయ అర్చకులు ముందుగా కాలభైరవస్వామి సన్నిధిని శుద్ధి చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు మేళ తాళాల మధ్య అభిషేకాలు ధూప, దీప, నైవేద్య, హారతులు సమర్పించారు. కాలభైరవ స్వామి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి మహాద్వారం నుంచి విజయ స్థూపం వరకు వెళ్లి అక్కడి నుంచి ప్రదక్షిణగా చేసి తిరిగి ఆలయంలో కొలువుతీర్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, జూలై 23: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పదహారు కాళ్ల మండపంలో వెలసిన ఆంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం సిందూరం దిద్ది పుష్పాలతో అలంకరించారు.

జార్ఖండ్ గవర్నర్‌కు స్వాగతం

రేణిగుంట, జూలై 23: జార్ఖండ్ గవర్నర్, తెలంగాణ, పుదిచ్చేరి ఇన్‌ఛార్జి గవర్నర్ రాధాకృష్ణన్‌కు బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న గవర్నర్‌కు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, నాయకులు స్వాగతం పలికారు. అనంతరం రాధాకృష్ణన్ రోడ్డు మార్గాన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

విద్యార్థులకు యూనిఫాం వితరణ



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న దాతలు

వరదయ్యపాళెం, జూలై 23: వరదయ్యపాళెం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు డైనమిక్ సిటిజన్స్ ఫౌండేషన్ మంగళవారం యూనిఫాం పంపిణీ చేసింది. ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ పేద విద్యార్థుల కనీస అవసరాలపై డైనమిక్ సభ్యులు దృష్టిపెట్టడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రామసుబ్బయ్య, బాలకృష్ణ, ప్రభాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీజేపీ సీనియర్ నేత మృతి



కృష్ణమ నాయుడు (ఫైల్‌ఫొటో)

ఏర్పేడు, జూలై 23: ఏర్పేడు మండలం మాధవమాల పంచాయతీ గుండ్రాలమిట్ట గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నేత సంద్ర కృష్ణమ నాయుడు(91) గుండెపోటుతో మంగళవారం మృతి చెందాడు. ఈయన ఏర్పేడు మండలానికి బీజేపీ అధ్యక్షుడిగా, ఉమ్మడి చిత్తూరు జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా, రాష్ట్ర కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా పనిచేశారు. అంతేకాకుండా 2017 నుంచి 2019 వరకు రైల్వేబోర్డు మెంబర్‌గా వ్యవహరించారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 23: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ దివాకర్ మంగళవారం అవగాహన కల్పించారు. దోమ కాటు ద్వారా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడు వాపు, బోదకాలు వంటి వ్యాధులు వస్తాయన్నారు. నాలుగు రోజులు పాటు నీరు నిల్వ ఉన్నచోట దోమలు ఉత్పత్తి చెందుతాయన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటిస్తే సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వార్డెన్ రామయ్య పాల్గొన్నారు.



అధ్వానంగా ఉన్న పాపానాయుడుపేట నుంచి వికృతమాల మీదుగా శ్రీకాళహస్తికి వెళ్లే రోడ్డు, రేణిగుంట - పాపానాయుడుపేట రోడ్డు దుస్థితి, ముసలిపేడు నుంచి పాపానాయుడుపేట వెళ్లే రోడ్డులో గుంతలు

గుంతలమయంగా గ్రామీణ రోడ్లు

ఏర్పేడు, జూలై 23: మండలంలో గ్రామీణ రోడ్లు గుంతలమయంగా మారి వాహనదారులకు చుక్కలు చూపుతున్నాయి. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో రోడ్ల నిర్వహణ పట్టించుకోకపోవడంతో గుంతలు ఏర్పడి అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ముఖ్యంగా రేణిగుంట నుంచి పాపానాయుడు పేటకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. కంకర తేలి గుంతలమయంగా మారింది. ఇటీవల ఈ రోడ్డును బాగు చేయాలని రోడ్లు, భవనాలశాఖ ఈఈ మధుసూదన్‌రావుకు, ఈనెల 21న కలెక్టర్ వెంకటేశ్వర్‌కు పాపానాయుడుపేట గ్రామస్థులు వినతిపత్రం ఇచ్చారు. అలాగే పాపానాయుడుపేట నుంచి వికృతమాల మీదుగా శ్రీకాళహస్తికి వెళ్లే రహదారి దారుణంగా ఉంది. రోడ్డు మీద భారీ గుంతలు ఏర్పడి ప్రయాణ నరకంగా మారింది. ఇక ముసలిపేడు - పాపానాయుడుపేట దారి గుంతలమయంగా మారి ప్రయాణికులకు చుక్కలు చూపుతోంది. ఇలా మండలంలో 14 ఆర్‌అండ్‌బీ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. అధికారులు స్పందించి గ్రామీణ రోడ్లను మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

రామగిరి ఆలయానికి తారురోడ్డు

- రూ.56 లక్షలతో 1.2 కి.మీ నిర్మాణం



పిచ్చాటూరు, జూలై 23: రామగిరి బస్టాండ్ నుంచి వాలీశ్వరస్వామి ఆలయం వరకు తారురోడ్డు నిర్మాణ పనులను అధికారులు పూర్తి చేశారు. రూ.56 లక్షలతో 1.2 కిలోమీటర్ల రోడ్డు పనులు ఎన్నికల ముందే ప్రారంభమైనా సగంలో ఆగిపోయాయి. ఈనెల 28,29,30 తేదీల్లో రామగిరి సుబ్రహ్మణ్యస్వామి ఆడికృత్తిక ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. సుమారు 30వేల మంది భక్తులు ఆలయానికి చేరుకుని కావళ్లు చెల్లించుకోవడం ఆనవాయితీ. రామగిరి బస్టాండ్ నుంచి ఆలయం వరకు రోడ్డు పనులు అర్థాంతరంగా నిలిచిపోయిన ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదిమూలం జిల్లా ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి ఆడికృత్తిక ఉత్సవాల లోపు పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వెంటనే స్పందించిన ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు రోడ్డు పనులు ప్రారంభించి పూర్తి చేశారు. అదేవిధంగా నాగలాపురం నుంచి టీపీకోట రోడ్డు మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి. వర్షాలకు పూర్తిగా ధ్వంసమైన ఈ రోడ్డు మరమ్మతు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఎమ్మెల్యే స్పందించి ఈ పనులను సైతం వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించడంతో మరమ్మతులు చేపట్టారు.

ఆధార్ నమోదు ప్రత్యేక కేంద్రాల ప్రారంభం

సత్యవేడు, జూలై 23: మండలంలోని దాసుకుప్పం, ఇరుగుళం సచివాలయాల్లో మంగళవారం ఆధార్ నమోదు ప్రత్యేక కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. దాసుకుప్పంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో డిజిటల్ అసిస్టెంట్లు ప్రకాష్, శ్రీధర్ 21 మందికి ఆధార్ నమోదు చేయించారు. ఇరుగుళంలో డిజిటల్ అసిస్టెంట్ బాలాజి 23 మందికి ఆధార్ నమోదు చేయించారని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 10నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆధార్ కేంద్రాలు పనిచేస్తాయని, బుధవారం కూడా ఆధార్ నమోదు క్యాంపులు జరుగుతాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందే జగన్: టీడీపీ

శ్రీకాళహస్తి, జూలై 23: మాజీ సీఎం జగన్‌కు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత లేదని టీడీపీ ఎస్టీసెల్ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు ఎం.సుబ్బయ్య అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ దేవాలయం వంటి అసెంబ్లీలో బూతుల మంత్రులతో కౌరవసభగా మార్చిన జగన్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లించనట్లు ఉందన్నారు. నాడు పోలీసుల అండతో అరాచకాలకు పాల్పడిన ఆయన నేడు పోలీసులకే నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వినుకొండ అంశాన్ని బూచీగా చూపి అసెంబ్లీని బాయికాట్ చేసి ఢిల్లీలో ధర్నా చేస్తామనడం హాస్యాస్పదమన్నారు.

మట్టి తరలిస్తున్న ఏడు టిప్పర్ల స్వాధీనం

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 23: మండలంలోని ఆలత్తూరు, రెడ్డిగుంటబాడవ గ్రామాల సమీపంలో అనుమతి లేకుండా రోడ్డుకు మట్టిని తరలిస్తున్న ఏడు టిప్పర్లను ఎస్ఐ వెంకటనరసింహ మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. మట్టి తరలింపునకు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ఏడు టిప్పర్లను ఎస్ఐ వెంకటనరసంహ పోలీసుస్టేషన్‌కు తరలించారు.

ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలకు ఏఐసీటీఈ గుర్తింపు

నారాయణవనం, జూలై 23: మండల పరిధిలోని ఇప్పతాంగల్ గ్రామంలో ఉన్న ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలకు ఏఐసీటీఈ గుర్తింపు లభించిందని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం నుంచి 2024-25 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్ కోర్సులకు అనుమతి లభించిందని కళాశాల చైర్మన్ ఎస్.వెంకటసుబ్బయ్య తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అగ్రతాంబూలం: బీజేపీ



సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

శ్రీకాళహస్తి, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రధాని నరేంద్రమోదీ అగ్రతాంబూలం ఇచ్చారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తాజా బడ్జెట్‌లో రాష్ట్రానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారన్నారు. రాష్ట్ర ప్రజలు ఎప్పటి నుంచో చూస్తున్న పోలవరం పూర్తికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించడం సంతోషకరమన్నారు. అలాగే రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15వేలు కోట్లు ప్రకటించడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, నీరు, విద్యుత్, రోడ్ల అభివృద్ధి కోసం అదనపు కేటాయింపులు, విశాఖ - చెన్నై, ఓర్వకల్లు - బెంగళూరు మధ్య ఏర్పాటు చేసే ఇండస్ట్రియల్ కారిడార్‌కు నిధులు కేటాయించడం శుభపరిణామన్నారు. అదే విధంగా రాయలసీమ, కోస్తాంధ్ర, ప్రకాశం జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయింపు ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజల తరపున ప్రధాని మోదీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పట్టణంలో సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, గరికపాటి రమేష్‌బాబు, ఎస్వీ రమణ, కొండేటి గోపాల్, వెంకటేశ్వర్లు, అమర్నాధ్, వాసుయాదవ్, ఢిల్లీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సజ్జ పంటపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

నారాయణవనం, జూలై 23: మండల పరిధిలోని గోవిందప్ప నాయుడు కండ్రిగ గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ మంగళవారం సజ్జ పంట సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సజ్జ పంటలో అధిక దిగుబడులు సాధించేందుకు చేపట్టవలసిన సస్య రక్షణ చర్యలను వివరించారు. కౌలు రైతులు రాణి, గుర్రమ్మకు గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్, ధనంజయరెడ్డి, సుబ్రహ్మణ్యం, ఏవో శోభారాణి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

రాచపాలెం సచివాలయంలో కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పుత్తూరు టౌన్, జూలై 23: రాష్ట్రీయా సేవా సమితి పొదుపు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని రాచపాలెం సచివాలయంలో శంకర్ నేత్రాలయ సహకారంతో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 170 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, 36 మందికి ఆపరేషన్ అవసరమని నిర్ధారించారు. కార్యక్రమంలో రాచపాలెం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుమారాస్వామి, రాస్ అధికారులు రవి, ప్రకాష్, ద్రాక్షాయణి, రమేష్‌బాబు, రజని, హరి, రాచపాలెం శల్యవైద్యుడు ప్రతాప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.


ప్రజా రవాణా సౌకర్యాలు మెరుగుపర్చండి



మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జూలై 23: నగరి నియోజకవర్గం నుంచి ఇతర ప్రాంతాలకు ప్రజారవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కోరారు. మంగళవారం అమరావతిలో రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరి - తిరుపతి మధ్య బస్సుల సంఖ్యను పెంచాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే నియో జకవర్గవాసులు పలువురు వృత్తి, వ్యాపారాల రీత్యా బెంగళూరులో స్థిరపడి ఉండడంతో పుత్తూరు నుంచి ఎక్స్‌ప్రెస్ సర్వీసుతో పాటు అల్ట్రా డీలక్స్ బస్సులు ప్రతిరోజు నడిపే అవకాశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు నింద్ర, విజయపురం, వడమాలపేట మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, రైతులు, కూలీల అవసరాన్ని గుర్తించి బస్సుల సంఖ్యను పెంచాలని మంత్రిని కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తులను పరిశీలించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రాధాన్యతా క్రమంలో బస్సులసంఖ్య పెంచుతామని హామీ ఇచ్చినట్లు భానుప్రకాష్ తెలిపారు.

మొక్కులు తీర్చుకున్న టీడీపీ కార్యకర్తలు



తిరుత్తణి ఆలయం వద్ద మొక్కులు తీర్చుకుంటున్న టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, జూలై 23: నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అత్యధిక మెజార్టీతో గెలవడంతో పట్టణానికి చెందిన వన్నెకుల క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ కే.అయ్యప్పరెడ్డి, ఐదవ వార్డు టీడీపీ నాయకుడు మొగిలి రెడ్డి మంగళవారం మొక్కులు తీర్చుకున్నారు. భానుప్రకాష్ గెలిస్తే తలనీలాలు సమర్పించు కుంటామని ఎన్నికల ముందు తిరుత్తణి సుబ్రమణ్యస్వామికి మొక్కుకున్నారు. ఎమ్మెల్యేగా గాలి భానుప్రకాష్ 45,004 ఓట్ల మెజార్టీతో గెలవడం, చంద్రబాబునాయుడు సీఎం కావడంతో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే భానుప్రకాష్ సారధ్యంలో నగరి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.